# క్రైమ్ మిర్రర్®

THE

Voice of Anti Corruption

హైదరాబాద్
26-6-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 96

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




# రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు బీమా భరోసా

కోటి ప్రమాద బీమా పథకం ప్రారంభం

రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగులే కీలకం

అందుకే వారి సంక్షేమానికి పెద్దపీట

రాష్ట్రాభివృద్ధి కోసం ఉద్యోగులు కష్టపడాలి

పన్నులు ఎగవేసే వారిని పట్టుకని వసూలు చేయాలి

రవీంద్రభారతి వేదికగా బీమాపథకం ప్రారంభించిన సిఎం రేవంత్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ రూ.1 కోటి ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడంలో ఉద్యోగులదే కీలకపాత్ర అని సీఎం పేర్కొన్నారు. ఉద్యోగుల

- మిగతా 3వ పేజీలో

## తెలంగాణ సిఎస్‌గా సంజయ్ జాజు!

ఉమ్మడి రాష్ట్రంలో విశేష సేవలు

సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు

అందుకే ఎంపిక చేసిన తెలంగాణ సర్కార్



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు నియమితులయ్యారు. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుత సి ఎస్ ఈ నెల చివర్లో పదవీ విరమణ చేయనున్నారు.

2లో



# దక్షిణాది రాష్ట్రాల ఐక్యత!

తుంగభద్ర నూతన గేట్ల ప్రారంభోత్సవం ఘనంగా..

హాజరైన ఏపీ, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు

సరిహద్దు జలాల వివాదం పరిష్కరించుకుందామని పిలుపు



## విమాన వై'భోగం'!

ప్రారంభోత్సవానికి భోగాపురం విమానాశ్రయం సిద్ధం

జూలై 5న జాతికి అంకితం చేయనున్న ప్రధాని నరేంద్ర మోడీ

2లో

## సర్ ప్రక్రియపై రాజకీయాలు తగవు

ఇది రాజ్యాంగబద్ధ ప్రక్రియ మాత్రమే

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ

## బాలయ్య చిన్న కుమార్తె పొలిటికల్ ఎంట్రీ!

భీమిలి నుంచి బరిలో తేజస్విని

కీలక నియోజకవర్గంగా మారదంతో చంద్రబాబు నిర్ణయం

**క్రైమ్ మిర్రర్, విశాఖపట్నం:** భీమిలి నుంచి బాలయ్య చిన్న కుమార్తె పోటీ చేస్తారా? వచ్చే ఎన్నికల్లో ఆమె అక్కడి నుంచి బరిలోకి దిగడం ఖాయమా? అలా జరుగుతున్న ప్రచారంలో నిజం ఎంత? ఇప్పుడు ఏపీ పొలిటికల్ సర్కిల్స్ లో ఇదే చర్చ నడుస్తోంది. నందమూరి ఫ్యామిలీ అంటే ప్రత్యేక గుర్తింపు ఉంది. అందులోనూ నందమూరి బాలకృష్ణ కుమార్తెలు అంటేనే ఒక రకమైన ప్రత్యేకత ఉంది. బాలకృష్ణ పెద్ద కుమార్తె బ్రాహ్మణి భర్త మంత్రి నారా లోకేష్. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా. చిన్న కుమార్తె తేజస్విని భర్త విశాఖ ఎంపీ శ్రీ భరత్. గీతం విద్యాసంస్థల అధినేత.

- మిగతా 3వ పేజీలో



# మాజీమంత్రి రోజా అరెస్ట్!

బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి సైతం

'ఆడుదాం-ఆంధ్ర'లో రూ.100 కోట్ల అవినీతి

మంత్రి రాంప్రసాద్ రెడ్డి సంకేతాలు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో**

మాజీ మంత్రి రోజా అరెస్టు తప్పదా? ఆమెను త్వరలో అరెస్టు చేస్తారా? ఆడుదాం ఆంధ్రాలో భారీ అవినీతికి పాల్పడ్డారా? విజిలెన్స్ విచారణ పూర్తయిందా? 100 కోట్ల రూపాయల అవినీతి అని తేలిందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణలో అవినీతికి సంబంధించి విజిలెన్స్ విచారణ పూర్తయిందని.. దాదాపు 100 కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడ్డారు అంటూ మంత్రి రాంప్రసాద్ రెడ్డి చెప్పారు. దీంతో త్వరలో రోజా అరెస్టు కావడం ఖాయమని తేలిపోయింది.



**అప్పట్లో క్రీడల మంత్రిగా..:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో క్రీడల శాఖ మంత్రిగా ఆర్కే రోజా ఉండేవారు. అప్పట్లో ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలను నిర్వహించారు. అయితే ఆ క్రీడల నిర్వహణలో దాదాపు 100 కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్నది ప్రధాన ఆరోపణ.

- మిగతా 2వ పేజీలో

## పవన్ కళ్యాణ్ చతుర్మాస దీక్ష!

నాలుగు నెలల పాటు చందన వస్త్రధారణలో

సాత్విక ఆహారం, సాధారణ జీవనం..

- మిగతా 2వ పేజీలో

## టీఎంసీ ఎంపీ మహువా యూటర్న్!

బెంగాల్ సీఎం సువేందుపై ప్రశంసలు

రాజకీయ రక్షణ కోసమే అంటున్న విశ్లేషకులు

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** బెంగాల్ రాజకీయాలు దేశంలోనే సంచలనంగా మారుతున్నాయి. మొన్నటి వరకు అక్కడ అప్రతిహాసంగా పాలించిన మమతా బెనర్జీకి గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. సొంత పార్టీలోనే తిరుగుబాటు జరిగింది. పార్టీ జాతీయ అధ్యక్షురాలు

- మిగతా 3వ పేజీలో

# దక్షిణాది రాష్ట్రాల ఐక్యత!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:** దక్షిణాది రాష్ట్రాల ఐక్యత కనిపించింది. ఎందుకు తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవం వేదికగా నిలిచింది. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి, కేంద్ర జల శక్తి మంత్రి సి ఆర్ పాటిల్ పాల్గొన్నారు. నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ. 51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. వాటిని ఈరోజు ప్రారంభించారు. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు జలవనురుల శాఖ మంత్రులు సైతం హాజరయ్యారు. పలువురు ఎంపీలతో పాటు ఎమ్మెల్యేలు కూడా పాల్గొన్నారు. తుంగభద్ర నది ఒడ్డున బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశంలో అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రులు సానుకూలత వ్యక్తం చేయడం విశేషం.

**దేశ చరిత్రలోనే నిలిచిపోతుంది..**

తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం దేశ చరిత్రలోనే నిలిచిపోతుందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మూడు తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుందని చెప్పారు. కేంద్రమంత్రి పాటిల్ పై ప్రశంసలు కురిపించారు రేవంత్. అనుభవజ్ఞుడైన ఆయన నేతృత్వంలో దక్షిణాది రాష్ట్రాల్లో శాశ్వత తాగు, సాగునీటి సమస్యలు పరిష్కారం అవుతుండడం శుభపరిణామంగా పేర్కొన్నారు. రాజోలి బండ డైవర్షన్ స్కీం లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ విషయాన్ని కేంద్ర జల శక్తితో పాటు ఏపీ సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లిన విషయాన్ని ప్రస్తావించారు. వీలైనంత త్వరగా నదీ జలాల వివాదాలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు.

**గుజరాత్ లో నదుల అనుసంధానం..**

నదుల అనుసంధానంతో గుజరాత్ లో సమృద్ధిగా జలాలు అందుబాటులో ఉంటున్న విషయాన్ని కేంద్ర జల శక్తి మంత్రి సి ఆర్ పాటిల్ గుర్తు చేశారు. ఏడు దశాబ్దాల కిందట మట్టితో నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పటికీ బాగుందని చెప్పారు. ఒక్క గేటు కొట్టుకుపోవడంతో మిగతా గేట్లను మార్చాల్సి వచ్చిందన్నారు. గుజరాత్ లో నర్మదా, సరోవర్ జలాలు మిళితం చేసి నదుల అనుసంధానాన్ని చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. లక్ష కోట్ల రూపాయలతో రాజస్థాన్, మధ్యప్రదేశ్లో మూడు నదులు అనుసంధానం చేపట్టిన విషయాన్ని కూడా వెల్లడించారు.

### భారత్ అన్ స్టాపబుల్...

గంగా, కావేరి నదులను అనుసంధానిస్తే భారత్ అన్ స్టాపబుల్ గా నిలుస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. తుంగభద్ర మూడు రాష్ట్రాల్లో లక్షలాదిమందికి జీవనోపాధి కల్పిస్తుందని చెప్పుకొచ్చారు. ఆరు నెలల్లో 33 గేట్లు అమర్చిన అందరిని అభినందనలు తెలిపారు. కేంద్ర జల వనరుల శాఖ మంత్రి నేతృత్వంలో ముఖ్యమంత్రులు కలవడం ఒక అద్భుత విషయం అన్నారు. పాటిల్ కు నదుల అనుసంధానం చేపట్టడంలో అనుభవం ఉందని.. ఆయన సేవలు దేశానికి అవసరం అని చెప్పారు సీఎం చంద్రబాబు. తుంగభద్ర నూతన గేట్ల ప్రారంభోత్సవం విజయవంతం కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయితే దక్షిణాది రాష్ట్రాల ఐక్యత స్పష్టంగా కనిపించింది ఈ వేదికపై.

# బాలయ్య చిన్న కుమార్తె పొలిటికల్ ఎంట్రీ!

(మొదటి పేజీ తరువాయి)

అయితే నారా బ్రాహ్మణి వ్యాపార రంగంలో రాణిస్తుండగా.. ఇప్పుడు తేజస్వినితో పొలిటికల్ ఎంట్రీ ఇప్పిస్తారన్న ప్రచారం నడుస్తోంది.

**జూబ్లీహిల్స్ మాదిరిగా..**

విశాఖకు పెద్ద ఎత్తున ఐటీ పరిశ్రమలు వస్తున్నాయి. ప్రపంచ దిగ్గజ గూగుల్ డేటా సెంటర్ విశాఖ రానున్న సంగతి తెలిసిందే. అయితే ఈ డేటా సెంటర్ భీమిలి నియోజకవర్గం పరిధిలో ఏర్పాటు కానుంది. ఒక్క గూగుల్ డేటా సెంటర్ మాత్రమే కాదు ఐటీ అనుబంధ పరిశ్రమలన్నీ భీమిలి నియోజకవర్గంలో ఏర్పాటు కానున్నాయి. దీంతో జూబ్లీహిల్స్ తరహాలో భీమిలి ఆవిర్భావం కానుంది.. దీంతో ఏపీలోనే భీమిలి నియోజకవర్గం కీలకంగా మారనుంది. అటువంటి నియోజకవర్గాన్ని తన కుటుంబ సభ్యుల చేతిలో ఉంచుకోవడానికి చంద్రబాబు ఆసక్తి చూపుతున్నారన్న ప్రచారం ఉంది. మరోవైపు ఎంపి శ్రీ భరత్ వచ్చే ఎన్నికల్లో భీమిలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తారన్న ప్రచారం కూడా జరిగింది. అయితే ఆయన భార్య తేజస్విని రంగంలోకి దించితే తెలుగుదేశం భవిష్యత్ రాజకీయాల కోసం ఉపయోగపడతారు అనే చర్చ జోరుగా సాగుతోంది.

**గంటా కుమారుడికి వేరే ఆప్షన్...**

ప్రస్తుతం భీమిలి ఎమ్మెల్యేగా సీనియర్ నేత గంటా శ్రీనివాస్ రావు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచారు. తరచు ఎన్నికలకు ఎన్నికలకు మధ్య నియోజకవర్గాలను మార్చుతుంటారు గంటా శ్రీనివాసరావు. 2019లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేసిన శ్రీనివాసరావుకు 2024 ఎన్నికల్లో చివరి నిమిషంలో భీమిలి టిక్కెట్ లభించింది. అయినా సరే అక్కడ భారీ మెజారిటీతో గెలిచారు. అయితే ఇప్పుడు బాలయ్య కుమార్తె పోటీకి దిగితే కచ్చితంగా గంటా శ్రీనివాసరావు రేసు నుంచి తప్పుకునే అవకాశం ఉంది. కానీ వచ్చే ఎన్నికల్లో గంటా శ్రీనివాసరావు బదులు.. ఆయన కుమారుడు రవితేజ పోటీ చేస్తారని ప్రచారంలో ఉంది. అయితే నియోజకవర్గాల పునర్విభజనతో.. మరో నియోజకవర్గాన్ని రవితేజకు సర్దుబాటు చేస్తారని తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో మాత్రం తేజస్విని పోటీ చేయడం ఖాయమని ప్రచారం జరుగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# మాజీమంత్రి రోజా అరెస్ట్!

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే దీనిపై విచారించింది. దాదాపు అన్ని జిల్లాల్లో విజిలెన్స్ విచారణ కొనసాగింది. అయితే అప్పట్లో నాసిరకం క్రీడా పరికరాలు కొనుగోలు, వైసిపి సానుభూతిపరులతోనే క్రీడా పోటీల నిర్వహణ, అసలు పోటీలే నిర్వహించకుండా కొన్నిచోట్ల నిధులు భారీగా ఖర్చు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా మంత్రిగా ఉన్న రోజా అప్పట్లో బినామీ కంపెనీలకు క్రీడా పరికరాల సరఫరా బాధ్యతను కట్టబెట్టారని.. నాసిరకం క్రీడా పరికరాలు అందించారని అభియోగాలు ఎదుర్కొన్నారు. అందుకే ఈ కేసులో ఆమెను ప్రధాన నిందితురాలుగా చేర్చి అరెస్టు చేసేందుకు కసరత్తు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

**శాప్ చైర్మన్ హోదాలో బైరెడ్డి..**

మరోవైపు అప్పట్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ చైర్మన్గా ఉన్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి సైతం అరెస్టు తప్పదు అని ప్రచారం సాగుతోంది. ఈ అవినీతిలో ఆయనకు సైతం హస్తం ఉందన్న ఆరోపణలు వచ్చాయి. పైగా తన అరెస్టుపై ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి. దమ్ముంటే అరెస్టు చేసుకోండి అంటూ సవాల్ చేస్తున్నారు. జైలు జీవితం తమకు కొత్త కాదు అని వ్యాఖ్యానిస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే ఇంతకుమించి ఉంటుందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. రోజాతో పాటు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి అరెస్టు తప్పదు అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి సంకేతాలు ఇచ్చారు. విజిలెన్స్ విచారణకు సంబంధించి నివేదిక ప్రభుత్వానికి చేరింది. అందుకే అరెస్టుల పర్వం ప్రారంభం కానుంది అని మంత్రి సంకేతాలు పంపారు. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# తెలంగాణ సిఎస్‌గా సంజయ్ జాజు!

దీంతో వ్యూహాత్మకంగా తెలంగాణ ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు ను నియమించింది. అయితే సంజయ్ ఎంపిక ఎవరు ఊహించలేదు. కానీ గతంలో సమర్థవంతంగా విధులు నిర్వహించడంతో ఆయనకు మంచి పేరు ఉంది. అందుకే తెలంగాణ సర్కార్ ఆయన వైపు మొగ్గు చూపింది.

**స్వేచ్ఛ ఇస్తేనే..**

సాధారణ పరిపాలనలో ఒక ఐఏఎస్, ఐపీఎస్ అధికారి ఎంతటి మేధావి అయినప్పటికీ.. వారి ఆలోచనలకు స్వేచ్ఛనిచ్చి.. వారి ప్రతిభను గుర్తించే ఒక సమర్ధుడైన రాజకీయ నాయకత్వం ఉంటేనే అధికార వ్యవస్థకు పూర్తిస్థాయిలో అందుతాయి. బ్యూరోక్రసీలో సృజనాత్మకతను, సాంకేతిక నైపుణ్యాన్ని వెలికి తీసి.. ప్రజాప యోగమైన ప్రాజెక్టులుగా మార్చడంలో లీడర్షిప్ పాత్ర అత్యంత కీలకం. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు సర్కార్ సంజయ్ జాజు సేవలను వినియోగించుకుంది. దాని ఫలితంగానే సమర్థవంతమైన అధికారిగా సంజయ్ గుర్తింపు సాధించారు. ఆ గుర్తింపు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఎంపికకు దోహదపడింది.

**మనస్ఫూర్తిగా బాధ్యతలు..**

ఒక ఐఏఎస్ అధికారి కేవలం సచివాలయ గదులకే పరిమితం కాదు. వారికి చాలా బాధ్యతలు ఉంటాయి. కానీ ఆ బాధ్యతలను గుర్తు చేసి పనిచేసుకునే బాధ్యత మాత్రం ప్రభుత్వాలదే. అలా చంద్రబాబు చాలా అవకాశాలు కల్పించింది. ఒక్క సంజయ్ మాత్రమే కాదు ఐఏఎస్ అధికారులు చంద్రబాబు గైడెన్స్ లో పనిచేయడానికి ఎక్కువగా ఇష్టపడతారు. అప్పట్లో సంజయ్ చంద్రబాబు సర్కార్లో పని చేశారు. కేవలం ఆదేశాలు పాటించడం మాత్రమే కాదు.. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ప్రతిపాదనలు కొన్నిసార్లు చేయాల్సి ఉంటుంది. అప్పట్లో విపరీతమైన ఒత్తిడి మధ్య సంజయ్ పనిచేసి చూపించారు. సత్ఫలితాలను అందించగలిగారు. అలా సంజయ్ రాటు తేలడం వల్లనే తదనంతర కాలంలో కేంద్ర సర్వీసులో రక్షణ, సమాచార ప్రసార శాఖల వంటి అత్యంత కీలకమైన విభాగాల్లో కార్యదర్శి స్థాయికి ఎదగగలిగారు. ప్రస్తుతం రేవంత్ సర్కార్ ఆయన ప్రతిభను పరిగణలోకి తీసుకుని ఈ నియామకం జరిపినట్లు తెలుస్తోంది. అయితే సీనియారిటీ పరంగా చాలామంది పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ రేవంత్ రెడ్డి మాత్రం సమర్థతకు పెద్దపీట వేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు.



# పవన్ కళ్యాణ్ చతుర్మాస దీక్ష!

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లో ఆధ్యాత్మిక భావాలు ఎక్కువ. ఆయన తరచూ ఆలయాల సందర్శన, వివిధ రకాల దీక్షలు చేపడుతుంటారు. గత రెండు సంవత్సరాలుగా ఆయన దీక్షలు చేస్తూ వస్తున్నారు. తాజాగా చతుర్మాష దీక్షను ప్రారంభించారు. జేష్ట మాసంతో ప్రారంభమయ్యే ఈ దీక్ష 120 రోజులపాటు కొనసాగుతుంది. అనంతరం కార్తీక మాసంలో దీనిని ముగిస్తారు. తాజాగా ఈ దీక్షను ప్రారంభించారు పవన్ కళ్యాణ్. చందన వస్త్రధారణలో దీక్షకు పూనారు. బుధవారం మంగళగిరిలోని పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లిన పవన్ కళ్యాణ్ ప్రత్యేక పూజలు చేశారు. అప్పటికి ఆయన దీక్ష వస్త్రాలు ధరించారు. పూజల అనంతరం ధ్యానం చేసిన తర్వాత... తిరిగి మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక గదిలో ఈ దీక్ష శిబిరం కొనసాగించనున్నారు.

**గతంలో చాలాసార్లు..**

గతంలో కూడా పవన్ కళ్యాణ్ చతుర్మాష దీక్షను చేపట్టారు. ఇప్పుడు తాజాగా మరోసారి శ్రీకారం చుట్టారు. దీక్ష సమయంలో పవన్ కళ్యాణ్ కుటుంబానికి దూరంగా ఉంటారు. సాత్విక ఆహారమే తీసుకుంటారు. పాలు, పండ్లు, ఉడికించిన కూరగాయలు వంటివి మితంగా తీసుకుంటారు. వస్త్రధారణలోనూ జాగ్రత్తలు పాటించనున్నారు. ఎరుపు రంగు అంచుతో కూడిన చందన వర్ణ దుస్తులను ధరించనున్నారు. ప్రతిరోజు దేవతారాధన, ధ్యానంలో నిమగ్నం అవుతారు. దీక్షా సమయంలో గురుముఖత నేర్చుకున్న మంత్ర పఠనం కి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**వారాహి యాత్ర విజయవంతం..**

గతంలో చాలాసార్లు దీక్షలు చేపట్టారు. జనసేన ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన చేపట్టిన వారాహి యాత్ర ఎంతగానో విజయవంతం అయింది. అధికారంలోకి వచ్చిన తరువాత.. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు వివాదం తలెత్తిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. తిరుమల కాలినడకన వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. ఆ సమయంలోనే అస్వస్థతకు గురయ్యారు. ఆయన ఆరోగ్యం పై ప్రభావం చూపింది. అయినా సరే దీక్షలు కొనసాగిస్తూ వస్తున్నారు పవన్ కళ్యాణ్. సనాతన ధర్మ పరిరక్షణలో భాగంగా ఆయన దక్షిణాది రాష్ట్రాల్లో ఆలయాలను సందర్శిస్తూ వచ్చారు. ఇప్పుడు మరోసారి చతుర్మాస దీక్ష చేపడుతుండడం విశేషం. కాగా కార్తీక మాసం వరకు ఈ దీక్ష కొనసాగనుంది.

# విమాన వై'భోగం'!

(మొదటి పేజీ తరువాయి)



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** ఏపీకి మరో గుడ్ న్యూస్ అందింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఫిక్స్ అయింది. జూలై 5న ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ఈ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్పోర్ట్ అత్యంత వైభవంగా ప్రారంభించేందుకు ఏపీ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి తుది అధికారిక ఆమోదం కోసం రాష్ట్ర అధికార యంత్రాంగం వేచి చూస్తోంది. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి జూలై 8 నుంచి పూర్తిస్థాయిలో విమాన రాకపోకలు ప్రారంభం అవుతాయి ఇప్పటికే అంతర్జాతీయ విమానయాన సంస్థ స్కూట్ జూలై 8 నుంచి సింగపూర్ కు తన తొలి సర్వీసును నడపనున్నట్లు ఇదివరకే ప్రకటించింది.

**ట్రయల్ రన్ సక్సెస్..**

ఇప్పటికే ఈ అంతర్జాతీయ విమానాశ్రయంలో ట్రయల్ రన్ పూర్తయింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తో పాటు పౌర విమానయాన శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రాగా.. సేఫ్ గా ల్యాండ్ అయింది. ట్రయల్ రన్ సక్సెస్ అయ్యింది. అయితే చిన్నచిన్న పెండింగ్ పనులు పూర్తయ్యేందుకు రెండు నెలలపాటు సమయం పట్టింది. ఇప్పుడు ప్రారంభ గడువు సమీపిస్తుండడంతో శరవేగంగా రూపుదిద్దుకుంటుంది ఎయిర్పోర్ట్ ప్రాంగణం. మరోవైపు దేశీయ విమానయాన సంస్థలు తమ సర్వీసులను విశాఖపట్నం ఎయిర్పోర్ట్ నుంచి భోగాపురం ఎయిర్పోర్ట్ కు మార్చేందుకు అన్ని ప్రయత్నాలు చేసుకుంటున్నాయి. జూన్ 9 నుంచి విశాఖ ఎయిర్పోర్ట్ పూర్తిగా నావి ఆధీనంలోకి వెళ్లిపోనుంది. ఇకనుంచి పౌర విమానయాన సేవలన్నీ భోగాపురం ఎయిర్పోర్ట్ కు పరిమితం కానున్నాయి.

**విభజన హామీల్లో భాగంగా..**

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా 2014లో ఏపీకి ఒక అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కేటాయించింది కేంద్ర ప్రభుత్వం. అలా రూపుదిద్దుకున్నదే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం. జిఎంఆర్ గ్రూపు అత్యంత ప్రతిష్టాత్మకంగా పిపిపి విధానంలో సుమారు 2200 ఎకరాల విస్తీర్ణంలో.. 5000 కోట్ల రూపాయల వ్యయంతో ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించింది. మొదటి దశలో ఈ ఎయిర్పోర్ట్ ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికుల రద్దీని తట్టుకునేలా.. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో రూపుదిద్దుకుంది. 77 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన టెర్మినల్ భవనంలో.. ప్రయాణికుల సౌకర్యార్థం 40 చెక్ ఇన్ కౌంటర్లు, 26 ఇమ్మిగ్రేషన్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఎయిర్పోర్ట్ అథారిటీ ప్రయాణికుల టిక్కెట్ల పై వసూలు చేసే యూజర్ డెవలప్మెంట్ ఫీజు రిఫ్ ను కూడా ఖరారు చేశారు.

**ఉత్తరాంధ్ర చిరకాల వాంఛ..**

ఉత్తరాంధ్ర ప్రజలు దశాబ్దాలుగా ఎయిర్పోర్ట్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కేవలం ఉత్తరాంధ్ర మాత్రమే కాకుండా ఒడిస్సా, చత్తీస్గఢ్ ప్రజలు సైతం రాకపోకలు సాగించే వీలుగా ఎయిర్పోర్ట్ ను తీర్చిదిద్దారు. ప్రయాణికులకు ట్రాఫిక్కు ఇబ్బందులు లేకుండా విశాఖ నగరం నుంచి ఎయిర్పోర్ట్ కానుసంధానించే నేషనల్ హైవే రోడ్డు కారిడార్ పనులను కూడా యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. ఎయిర్పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్రలో ఐటీ రంగంతో పాటు పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా మెరుగు పడనున్నాయి.

## సర్ ప్రక్రియపై రాజకీయాలు తగవు

హైదరాబాద్: రాజ్యాంగబద్ధమైన సర్ పక్రియను రాజకీయం చేయొద్దని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. 'సర్ పక్రియ ఒక చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన పక్రియ మాత్రమేనని, దీనిని ఏ ఒక్కరూ రాజకీయ కోణంలో చూడకూడదన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'సర్ అనేది కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం దేశవ్యాప్తంగా జరిగే ఒక నిరంతర పక్రియ అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అదే సమయంలో నకిలీ లేదా అక్రమ ఓట్లను తొలగించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశమని వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో, క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఈ సవరణలు చేపడుతున్నారని ఆయన తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ అనేది ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన పక్రియ అని, దీనిపై కొన్ని రాజకీయ పక్షాలు స్వార్థ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని కిషన్‌రెడ్డి హితవు పలికారు. కొన్ని రాజకీయ పార్టీలు ఈ పక్రియపై కావాలనే అపోహలు సృష్టిస్తూ, ప్రజలను, అధికారులను గందరగోళానికి గురిచేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇటువంటి సవరణలు జరిగాయని గుర్తుచేసిన కేంద్రమంత్రి, ఇప్పుడు దీనికి రాజకీయ రంగు పులమడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

# ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కి "బుల్లెట్" దించిన లక్డారం దళితులు



- లక్డారం దళితులకి న్యాయం చెయ్యక పోతే ఎమ్మెల్యే పదవికి మరిచిపోవాలి
- ఎస్టీపి ప్లాంట్ అసలు సూత్ర దారుడు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నె
- లక్డారం దళితుల ఆగ్రహ జ్వాల.. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై తీవ్ర విమర్శలు
- పటాన్ చెరు రాజకీయ నాయకుల పై దుమ్మెత్తి పోసిన లక్డారం దళితులు
- దళితులమనే 75 ఏండ్లు గా కాస్తుల ఉన్న భూమిని గుంజుకోవాలని చూస్తున్నారు
- లక్డారం లొ కులవివక్ష నేటికి కొనసాగుతుందని ఆవేదన
- తమ భూమి తమకు ఆన్లైన్ లొ ఎక్కించి పట్టాలు ఇవ్వాలన్న రైతులు
- లేదంటే ఆమరణ నిరాహారదీక్ష యోచనలో లక్డారం దళిత రైతులు
- తీవ్ర విమర్శలు గుప్పించిన సొంత బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు
- తమ భూములు తమకే కావాలంటూ దళితుల ఆందోళన
- దళితుల భూముల్లో ఎస్టీపీకి వ్యతిరేకంగా ఆందోళన
- అక్రమ తవ్వకాలతోనే ఇబ్బందులు.. ఇప్పుడు ఎస్టీపీపై నిరసన
- ప్రాజెక్ట్ విరమించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరిక
- భూములు ఆన్‌లైన్ చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్
- దళితుల భూములు లాక్కోవడానికి అన్ని రాజకీయ పార్టీలు ఏకం

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూన్ 25:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోనిఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్డారం గ్రామంలో ప్రతిపాదిత ఎస్టీపీ అంటే సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ప్రాజెక్ట్‌పై దళిత రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, గ్రామసభ నిర్వహించకుండా దళితుల భూముల్లో ప్రాజెక్ట్ పనులు చేపట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూనే ఉన్నారు. గత 20 రోజులుగా పొలాల దగ్గరే దళిత రైతులు నిరసనలు చేస్తున్నారు. తాజాగా గురువారం వారు ఒక టీవీ ఛానెల్ తొ మాట్లాడుతూ.. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పై తీవ్రంగా ఆరోపణలు చేశారు. తమ భూముల్లో ఎస్టీపి ప్లాట్ ఏర్పాటుకు అసలు సూత్ర దారి, కుట్ర దారు ఎమ్మెల్యేనె అని ఆరోపించారు. ఇట్టి విషయాన్ని పటాన్‌చెరు లొ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయనికి వెళ్లి కలిసినప్పుడు ఎమ్మెల్యే తమను బయటకు వెళ్లి పొండి అని అన్నడని ఆవేదన చెందారు. ఇక తమ భూమిని మర్చి పొండని తమతొ హేళన చేసి మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత వరకు పటాన్ చెరు లోని రాజకీయ నాయకులు సిపిఎం పార్టీ వారు తప్ప ఎవరు తమ వద్దకు రాలేదని విమర్శించారు. తాము దాదాపు 75 ఏళ్లకు పైగా సాగు చేసుకుంటున్న భూములను ఎస్టీపీ పేరుతో స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులమనే కారణంతోనే తమ భూములపై కన్నేశారని, ఇప్పటికీ గ్రామంలో కులవివక్ష కొనసాగుతోందని ఆరోపించారు. వెంకటేశ్వర స్వామి గుడికి పోతే తమను గుడిలోకి రానివ్వరని అరిపోయించారు. తమ భూములను



వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాస్‌బుక్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరగకపోతే భవిష్యత్తులో రాజకీయంగా తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కూడ పదవి మర్చి పోవాలని బుల్లెట్ దించారు. కొందరు బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా ఈ వ్యవహారంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేపై విమర్శలు గుప్పించారు. గూడెం మహిపాల్ రెడ్డి ని స్వయంగా 3 సార్లు ఎమ్మెల్యే గా గెలిపించామని అన్నారు. దానికి ఆయన తమ భూముల పైనే కన్ను వేశాడని విమర్శించారు. గ్రామస్తుల కథనం ప్రకారం, ఆమీన్పూర్ ప్రాంతంలో ప్రజల వ్యతిరేకత కారణంగా నిలిచిపోయిన ఎస్టీపీ ప్రాజెక్ట్‌ను ఇప్పుడు లక్డారం దళితుల భూముల్లో





ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజల అభిప్రాయం తీసుకోకుండా పనులు ప్రారంభించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. లక్డారం గ్రామ ప్రజలు ఇప్పటికే పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న కంకర క్రషర్లు, కృత్రిమ ఇసుక తయారీ యూనిట్లు, అక్రమ మట్టి రవాణా కారణంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. భారీ టిప్పర్ల రాకపోకలతో రోడ్లు దెబ్బతినడంతో పాటు దుమ్ము, ధూళి, కాలుష్యం పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపించారు. మురుగునీటి శుద్ధి కేంద్రం గ్రామ సమీపంలో ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో పర్యావరణ, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఎస్టీపీ ప్రాజెక్ట్‌ను విరమించుకోవాలని, లేకపోతే ఆమరణ నిరాహార దీక్షతో పాటు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. గ్రామ ప్రజల భూముల సమస్యను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించి న్యాయం చేయాలని దళిత రైతులు డిమాండ్ చేశారు.



## ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి: సర్పంచ్ మందుల నాగయ్య

**కోదాడ , జూన్ 25 క్రైమ్ మిర్రర్ :** గుడిబండ గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఏఆర్)లో భాగంగా గ్రామ సర్పంచ్ శ్రీ మందుల నాగయ్య ఆధ్వర్యంలో బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరు జాబితాలో పేరు నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.సమావేశంలో సర్పంచ్ మందుల నాగయ్య మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, గ్రామంలో ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా జాబితాలో చేరకుండా మిగిలిపోకూడదని అన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులను గుర్తించి కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని, అలాగే మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారి వివరాలను నిబంధనల ప్రకారం సవరించాలని సూచించారు.ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్ఓలకు ఆదేశించారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా ప్రతి వివరాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల విషయంలో అధికారులకు సహకరించాలని కోరారు.గ్రామంలోని ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు

## 28న నల్లగొండ పర్యటనకు సిఎం రేవంత్

హైదరాబాద్:ఈనెల 28న నల్లగొండకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారు. 13వేల కోట్ల వ్యయంతో నిర్మించే హ్యామ్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సిఎం పర్యటన సందర్భంగా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి.హైదరాబాద్ నుండి హెలికాప్టర్ లో బయలుదేరి నల్లగొండ జిల్లా కనగల్ మండలం చేరుకొని...మొదటగా... కనగల్ మండలం మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన 'హ్యామ్' రోడ్ల పైలాన్ ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. అనంతరం...నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో మొదటి ఫేజ్ డ్రింకింగ్ వాటర్ అందించే పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఎన్జీ కాలేజి గ్రౌండ్స్ లో జరిగే భారీ బహిరంగ సభకు హాజరుకానున్నారు. . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం...అనంతరం మహిళా సంఘాలకు చెక్కులు అందజేయనున్నట్లు వెల్లడించారు.

## టీఎంసీ ఎంపీ మహువా యూటర్న్!

(మొదటి పేజీ తరువాయి)

పదవి నుంచి మమతా బెనర్జీని తొలగించారు. 59 మంది ఎమ్మెల్యేలు, 20 మంది ఎంపీలు మమతా బెనర్జీ వ్యతిరేకించారు. ఏకంగా ఆ పార్టీ అధ్యక్ష పదవి నుంచి తొలగించారు. అయితే ఇంతకాలం మమతా బెనర్జీ వెంటే ఉంటూ జాతీయ స్థాయిలో బిజెపిపై నిప్పులు చేరిన తృణమూల్ కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్ ఎంపీ మహువా మొయిత్ర పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. బిజెపిలోకి వెళ్లలేక సీఎం సువేందు అధికారితో తనకు ఉన్న పాత సంబంధాలను గుర్తు చేసుకుంటూ ఆమె ప్రశంసలు కురిపించడం ఇప్పుడు హాట్ టాపిక్ అవుతోంది.

**మమతా వెంట ఉంటూనే..**

ప్రస్తుతం మమతా బెనర్జీ వెంటే ఉన్నారు మహువా. బిజెపి సిద్ధాంతాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడేవారు. అందుకే ఆమె బిజెపిలోకి వెళ్తామన్న ఎంట్రీ ఉండే పరిస్థితి లేదు. అలాగని బెంగాల్లో టిఎంసి ప్రజాప్రతినిధుల పట్ల జరుగుతున్న దాడులతో ఆమె ఆందోళనకు గురవుతున్నారు. ఒకవైపు మమతా బెనర్జీకి నమ్మదగిన నేతగా ఉంటూనే.. ప్రభుత్వం నుంచి.. రాజకీయ ప్రత్యర్థుల నుంచి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ఆమె ఇప్పుడు బెంగాల్ సీఎం సువేందు అధికారిని ప్రశంసలతో ముంచేత్తుతున్నారు. బెంగాల్ పొలిటికల్ సర్కిల్స్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. తన తొలి రాజకీయ ప్రస్థానంలో సువేందూ అధికారి తనకు ఎంతో అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు మహువా. వ్యక్తిగత స్థాయిలో కూడా తనకు ముఖ్యమంత్రితో సంబంధం ఉందని చెప్పుకున్నారు. గతంలో తనకు సభ టికెట్ దక్కక పోయేసరికి.. రోజంతా ఏడుస్తూనే ఉన్నానని.. ఆ సమయంలో సువేందూ అధికారి అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అయితే ఆమె ఇప్పుడు యూటర్న్ తీసుకోవడం మాత్రం పొలిటికల్ సర్కిల్స్ లో ఒక రకమైన ప్రచారం జరుగుతోంది. అంతటితో ఆగని ఆమె ఇటీవల టీఎంసీ నుంచి వలసల పై బహిరంగంగా వ్యాఖ్యానించారు. సువేందు అధికారి పార్టీ నుంచి బయటకు వెళ్ళినప్పుడు పారదర్శకంగా ఒక పద్ధతి ప్రకారం వెళ్లారని కూడా గుర్తు చేసుకోవడం విశేషం.

**పెరుగుతున్న దాడులతో..**

బెంగాల్ రాజకీయాల్లో ఇప్పుడు ప్రజాప్రతినిధులపై దాడులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా భిన్న స్వరాలు వినిపించే నాయకులపై క్షేత్రస్థాయిలో కోడిగుడ్ల దాడులు, తీవ్ర నిరసనలు వ్యక్తం అయ్యే ప్రమాదం ఉంది. అటు మమతా బెనర్జీకి నమ్మకస్తురాలిగా ఉంటూనే.. ఇటు అధికారంలో ఉన్న సీఎం సువేందు అధికారితో వ్యక్తిగత మైత్రిని ప్రదర్శిస్తున్నారు మహువా. కేవలం తన రాజకీయ రక్షణ కోసమే ఆమె యూటర్న్ తీసుకున్నారు అనేది బెంగాల్ పొలిటికల్స్ సర్కిల్స్లో వినిపిస్తున్న మాట.

## రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు బీమా భరోసా

భద్రత, వారి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో బీమా పథకాన్ని గురువారం సాయంత్రం సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ, ప్రమాద బీమా పథకాన్ని తొలిసారిగా సింగరేణిలో ప్రారంభించామన్నారు. 45 మంది కార్మికుల కుటుంబాలకు బీమా సాయం అందించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తాను కూడా మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినేనని, ఉద్యోగుల సమస్యలు, వారి అవసరాలు తనకు బాగా తెలుసని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అందరికీ భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. తాను దొరను కాదని, ప్రజల మధ్య నుంచి ఎదిగిన వ్యక్తినని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. మంత్రివర్గానికీ తానే మేస్త్రీ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎవరు అవహేళన చేసినా పట్టించుకోనని, రేవంతన్నగా పిలిపించుకోవడమే తనకు ఇష్టమని చెప్పారు. పదవులు, హోదాలు మారొచ్చుగానీ ప్రజలతో తన అనుబంధం ఎప్పటికీ మారదని స్పష్టం చేశారు. అలాగే గత పాలనలో ఉద్యోగులకు ప్రతి నెల 10వ తేదీ వరకు కూడా జీతాలు అందని పరిస్థితి ఉండేదని విమర్శించారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1 నుంచి ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులు ప్రమాదంలో చనిపోతే కోటిన్నర బీమా ఇస్తామని ప్రకటించిన సీఎం.. ఆదిశగా ముందడుగు వేశారు. బ్యాంకులను ఒప్పించి బీమా ఎంఓయూపై సంతకం చేశారు.ఈ బీమాతో 15 లక్షల మంది రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు లబ్ది చేకూరనుంది. పెన్షనర్లు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ఈ బీమా వర్తించనుంది. తొలుత సింగరేణి సంస్థలో ఈ బీమాను ప్రారంభించారు. ఇప్పటికే 45 మంది సింగరేణి కార్మికులు చనిపోతే కోటిన్నర బీమా చెల్లించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు కోటిన్నర బీమా అమలులో డిప్యూటీసీఎం భట్టి కృషి ఎంతో ఉందన్నారు. ఉద్యోగులంతా ప్రభుత్వంలో కుటుంబ సభ్యులు.. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తొలుత ఈ బీమా అమలుపై అనేక సందేహాలున్నా.. తర్వాత ఉద్యోగులకు సంక్షేమమే లక్ష్యంగా ఎంతో కసరత్తు చేశామన్నారు. బ్యాంకర్లను ఒప్పించి ఈ బీమాను కల్పించామన్నారు సీఎం. మరోవైపు విమాన ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగులకు రూ.3కోట్ల బీమా కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు నడుం బిగించాలని సీఎం పిలుపునిచ్చారు.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్





ప్రపంచం బాగుండాలంటే ముందు ట్రంప్ దూకుడుకు అక్కడి పార్లమెంట్ కళ్లెం వేయాలి. ఇరాన్‌పై ఇంకా ఆంక్షలు విధించడం, బెదిరించడం వంటివి చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఒక్క ట్రంప్ కారణంగా ప్రపంచం యావత్తూ అతాలకుతలం అయ్యింది. సునీమా వచ్చినంత పనయ్యింది. మళ్లీ కోలుకోవడమెలా అన్న సందిగ్ధంలో ప్రపంచ దేశాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక స్థితి దిగజారింది. ముఖ్యంగా భారత్ లాంటి అనేక దేవాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఇరాన్‌ను తన మానా తను బతికేలా చూడాలి. ట్రంప్ ఇక తన దేశ పురోగతికి సమయం కేటాయిస్తే చాలు. హర్మూజ్ తెరుచుకోవడం, చమురు ధరలు దిగిరావడం అన్నది ఊరటనిచ్చే అంశం. ముఖ్యంగా భారత్‌కు పెద్ద ఊరట అని చెప్పాలి. అలాగే భారత్ ఎవరి వద్ద చమురు కొనాలో వద్దో అన్నది అమెరికాకు సంబంధించిన వ్యవహారం కాదు. భారత్ ఎవరితో వాణిజ్యం చేయాలో చేస్తుంది. ఎవరితో చమురు డీల్ చేసుకోవాలో చేసుకుంటుంది. అంతేగానీ వేలుపెట్టాలని ఇక ట్రంప్ చేడడం మానుకోవాలి. ట్రంప్ తీరువల్ల అమెరికా ఇప్పటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. అక్కడా చమురు ధరలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. అక్కడున్న వారిని వెళ్లగొట్టే ప్రయత్నంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రణసంకటంగా మారాయి. ముఖ్యంగా భారతీయ టెక్కీలకు ఇదొక సమస్యగా మారింది. ఇకపోతే చమురు ధరలు దిగిరావడం, మళ్లీ హర్మోజ్ తెరుచుకోవడంతో ఇక స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం వచ్చింది. దీనిపై అటు ట్రంప్ కానీ, ఇటు ఇరాన్ కానీ పేచీలు లేకుండా చూసుకోవాలి. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం


## ఇరాన్‌తో ఆయిల్ డీల్‌కు మళ్లీ అవకాశం!

వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో భారత్-ఇరాన్ మధ్య ఇంధన రంగంలో మళ్లీ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్‌నెజాద్ ఈ వారం భారత పెట్రోలియం మరియు సహజ వాయు మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్న నేపథ్యంలో, భారత్‌కు ఇరాన్ నుంచి ముడి చమురు సరఫరాల భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో పరిమిత స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. అమెరికా ఆంక్షలకు ముందు భారత్‌కు ప్రధాన ముడి చమురు సరఫరాదారుల్లో ఇరాన్ ఒకటి. ముఖ్యంగా తక్కువ ధరలు, అనుకూల క్రెడిట్ సౌకర్యాలు, భారత రిఫైనరీలకు అనువైన నాణ్యత కారణంగా ఇరాన్ చమురుకు మంచి డిమాండ్ ఉండేది. భారత్-ఇరాన్ మధ్య జరగనున్న తాజా చర్చలు ఇంధన రంగంలో కొత్త అవకాశాలకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు పునరుద్ధరించబడేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, భవిష్యత్ కొనుగోళ్లు వాణిజ్య ప్రయోజనాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు మరియు ఆంక్షల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. 2015లో భారత్ సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అది దేశ మొత్తం చమురు దిగుమతుల్లో 6 శాతం వాటాను కలిగి ఉంది. 2016లో ఈ దిగుమతులు 14 ఎంఎంటీలకు చేరి వాటా 6.7 శాతానికి పెరిగింది. అయితే, 2017లో ఇరాన్ నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ఆ ఏడాది భారత్ 27 ఎంఎంటీల చమురును కొనుగోలు చేయగా, దేశ మొత్తం చమురు అవసరాల్లో ఇరాన్ వాటా 12.6 శాతానికి చేరుకుంది. ఇదే గరిష్ట స్థాయి. 2018లో దిగుమతులు 23 ఎంఎంటీలకు తగ్గినా, ఇరాన్ వాటా 10.4 శాతంగా కొనసాగింది. 2019లో 24 ఎంఎంటీల దిగుమతులతో ఇరాన్ వాటా 10.6 శాతంగా నమోదైంది. అయితే 2019 మేలో అమెరికా

ఇరాన్‌పై ఆంక్షలను కఠినతరం చేసి, చమురు కొనుగోలు చేసే దేశాలకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో భారత్ ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపి వేయాల్సి వచ్చింది. ఈ ప్రభావం 2020లో స్పష్టంగా కనిపించింది. ఆ ఏడాది భారత్ కేవలం 2 ఎంఎంటీల చమురును మాత్రమే ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. దీంతో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 1 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఇటీవల నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ (ఎన్ఐఓసీ) భారత రిఫైనరీలు, వ్యాపార సంస్థలను సంప్రదించి భవిష్యత్ చమురు సరఫరాలపై చర్చలు ప్రారంభించి నట్లు సమాచారం. అయితే భారత రి÷నైరీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలపై స్పష్టత, చెల్లింపు విధానాలు, షిప్పింగ్ మరియు బీమా సౌకర్యాలపై భరోసా లభించిన తర్వాతే పెద్ద ఎత్తున కొనుగోళ్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కెప్లర్ డేటా ప్రకారం, జూన్ నెలలో భారత్ రోజుకు సుమారు 73 వేల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఏప్రిల్‌లో పరిమిత స్థాయిలో పునఃప్రారంభమైన సరఫరాలు క్రమంగా పెరుగుతున్నట్లు ఇది సూచిస్తోంది.

# నిందల పర్వం - బాధ్యత ఎవరిది

మానవజాతి పరిణామ క్రమంలో, నాగరికత నడిచివచ్చిన సుదీర్ఘ చరిత్రలో ఒక శాశ్వతమైన ప్రశ్న ఎల్లప్పుడూ మారుమోగుతూనే ఉంది. తత్వవేత్తలను సైతం నిరంతరం ఆలోచింపజేసే ఆ ప్రశ్న మన తప్పుకు మనమే బాధ్యత వహించగలమా? వినడానికి ఈ ప్రశ్న చాలా సరళంగా, సులభంగా అనిపించవచ్చు. కానీ దీని లోతుల్లోకి తొంగిచూసినప్పుడు మన సామాజిక చట్రం, మన సంస్కృతి, నైతిక విలువలు మరియు మన అంతరాత్మ ప్రవృత్తి అన్నీ కూడా ఈ ఒక్క ప్రశ్న చుట్టూనే పరిభ్రమిస్తున్నాయని అర్థమవుతుంది. తప్పు చేయడం అనేది మానవ సహజ సిద్ధమైన స్వభావంలో ఒక భాగం. అడవి నుంచి అడుగులు వేసిన ఆదిమానవుడి కాలం నుండి, అంతరిక్షంలో విహరిస్తున్న నేటి ఆధునిక కంప్యూటర్ యుగం మనిషి వరకూ ప్రతి ఒక్కరూ తమ జీవిత ప్రయాణంలో ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక సందర్భంలో తప్పు చేసే ఉంటారు. అయితే, ఆ పొరపాటుకు వేరొకరిని నెట్టేయకుండా, మనమే స్వయంగా నైతిక బాధ్యత వహించడం అనేది అత్యంత కఠినమైనది. అదే సమయంలో సమాజానికి అది చాలా అవసరమైన విలు వకూడా.ప్రస్తుత సమాజ గమనాన్ని మనం నిశితంగా గమనిస్తే తప్పు చేసిన వ్యక్తి ఏమాత్రం సంకోచించకుండా అది నా తప్పు కాదు అని బుకాయించడం ఒక సర్వసాధారణ విషయంగా మారిపోయింది. నాలుగు గోడల మధ్య ఉండే కుటుంబం దగ్గర నుండి నడిరోడ్డుపై నడిచే రాజకీయాల వరకు, మన వ్యక్తిగత జీవితాల నుండి వృత్తిపరమైన కార్పొరేట్ సంఘర్షణల వరకు అవును, నేను తప్పు చేశాను అని గుండెల మీద చేయి వేసుకుని చెప్పే నైతిక ధైర్యం రోజురోజుకూ కనుమరుగైపోతోంది. బహుశా అహమో, లేక సమాజం ఏమనుకుంటుందో అనే భయమో మనిషిని నిజాయితీకి దూరం చేస్తోంది. ఈ సంక్లిష్ట సందర్భంలో మన తప్పుకు మనమే బాధ్యత వహించగలమా? అనే ప్రశ్న మన నైతికతకు ఒక అద్దం పట్టి చూపిస్తుంది.చరిత్రను తిరగేస్తే మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి యుగపురుషులు సైతం తమ వ్యక్తిగత, సామాజిక జీవితాల్లో కొన్ని పొరపాట్లు చేశారు. కానీ ప్రపంచం వారిని తప్పుపట్టలేదు, పైగా ఆరాధించింది. దానికి కారణం వారు తమ తప్పులను బహిరంగంగా, నిష్కపటంగా అంగీకరించారు. వాటి నుండి పాఠాలు నేర్చుకుని, తమను తాము నిరంతరం మెరుగుపరుచుకున్నారు. తప్పును ఒప్పుకోవడం అనేది ఎన్నటికీ బలహీనత కాజాలదు అది మనిషి అంతర్గత చైతన్యానికి నిదర్శనమైన ఒక అద్భుతమైన శక్తి. నేను పొరపాటు చేశాను అని మనస్ఫూర్తిగా చెప్పగలిగిన వ్యక్తి మాత్రమే జీవితంలో సమున్నతంగా ఎదగగలడు.ఆధునిక మనస్తత్వ శాస్త్ర పరిశోధనల ప్రకారం కూడా, తమ తప్పులను మనస్ఫూర్తిగా అంగీకరించే వ్యక్తుల్లో మానసిక ఒత్తిడి తగ్గి, మానసిక ఆరోగ్యం అత్యంత మెరుగ్గా ఉంటుంది. అలాంటి వారి సామాజిక సంబంధాలు మరింత దృఢంగా ఉంటాయి. వారిలో నిజమైన ఆత్మవిశ్వాసం రెట్టింపు అవుతుంది. క్లిష్టమైన సమస్యలను సైతం సునాయాసంగా పరిష్కరించే సృజనాత్మక సామర్థ్యం వారిలో వృద్ధి చెందుతుంది. బాధ్యతను స్వీకరించడం అనేది కేవలం ఒక అలవాటు కాదు, అది వ్యక్తిత్వ వికాసానికి అసలైన పునాది అని సైకాలజిస్టులు స్పష్టం చేస్తున్నారు.మన చుట్టూ ఉన్న సామాజిక వ్యవస్థలో తప్పులకు బాధ్యత తీసుకోకపోవడం వల్ల కలిగే నష్టాలు అపారమైనవి. ఉదాహరణకు ఒక రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు, నా అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగింది అని నిజాయితీగా ఎంత మంది చెబుతారు? ఏదైనా ఒక పెద్ద అవినీతి స్కామ్ లేదా కుంభకోణం బయటపడినప్పుడు, బాధ్యత గల స్థానంలో ఉన్న ఒక్కరైనా ఇది నా పరిపాలనా వైఫల్యం అని అంగీకరిస్తున్నారా? గల్లీ నుండి ఢిల్లీ దాకా అంతా ఎదుటివారిపై వేలెత్తి చూపడమే. చివరకు ఇళ్ళల్లో పిల్లలు ఏదైనా తప్పు చేసినప్పుడు, తల్లిదండ్రులు మేము వారిని సరిగ్గా పెంచలేకపోయాం అని ఒప్పుకుంటారా? ఈ ప్రశ్నలకు లభించే సమాధానాలు చాలా చేదుగా, నిష్ఠురంగా ఉంటాయి. ఎందుకంటే మన సమాజంలో తప్పు ఒప్పుకోవడాన్ని ఇంకా ఒక అవమానంగా, తక్కువతనంగా భావించే సంకుచిత భావన బలంగా నాటుకుపోయింది.ఈ విధంగా బాధ్యత తీసుకోకపోవడం వల్లే అనేక సామాజిక రుగ్మతలు సమాజంలో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. నేటి కుటుంబాల విచ్ఛిన్నాలు, వ్యాపార రంగంలో జరుగుతున్న మోసాలు, రాజకీయాల్లో రాజ్యమేలుతున్న అవినీతి వీటన్నింటి మూలాల్లో నేను బాధ్యుడిని కాదు అనే స్వార్థపూరిత మనోభావమే దాగుంది. వ్యవస్థలో ఒక్కో వ్యక్తి తన తప్పును తాను గుర్తించి ఒప్పుకుంటే, సమాజం మొత్తం ఒక అడుగు ముందుకు పడుతుంది. కానీ దురదృష్టవశాత్తూ అందరూ ఒకరి మీద ఒకరు నిందలు నెట్టుకుంటూ కాలం వెళ్లదీస్తే సమాజం మరింత వెనకడుగు వేయక తప్పదు.మన అమూల్యమైన తెలుగు సంస్కృతి, ఉదాత్తమైన సాహిత్యం మరియు పూర్వీకుల కాలాతీత జ్ఞానం అన్నీ కూడా నైతిక బాధ్యత గురించి చాలా స్పష్టంగా, విడమరిచి చెప్పాయి. పాపమెంచుకొని పరితపించు అని భాగవతంలో పోతన మహాకవి ప్రబోధించారు అంటే మనం చేసిన తప్పును తెలుసుకుని పశ్చాత్తాపం చెందడం మానవ ధర్మంలో అత్యంత ముఖ్యమైన భాగం అని దీని భావం. తిక్కన, ఎఱ్ఱన, నన్నయ వంటి కవిత్రయం కూడా తమ అమూల్యమైన రచనల ద్వారా ధర్మ మార్గంలో, నైతిక బాధ్యతతో నడవడమే మనిషికి నిజమైన అందం అని లోకానికి బోధించారు.మన పల్లెటూరి జీవన విధానంలో ఒకప్పుడు ఒక అద్భుతమైన నైతిక విలువ చలామణీలో ఉండేది. పూర్వ కాలంలో గ్రామ పంచాయితీలు లేదా రచ్చబండల దగ్గర తప్పు చేసిన వ్యక్తి ఎవరి భయమూ లేకుండా స్వయంగా ముందుకు వచ్చి అయ్యా, నా వల్ల పొరపాటు జరిగింది, క్షమించండి అని అంగీకరించే సాంప్రదాయం నడిచేది. ఆనాడు పల్లె జనుల్లో ఉన్న నైతిక ధైర్యమే మన తెలుగు సమాజాన్ని ఒకప్పుడు సగర్వంగా, బలంగా నిలబెట్టింది. కాలగర్భంలో కలిసిపోతున్న ఆ ప్రాచీన నైతిక విలువలను మళ్ళీ వర్తమానంలోకి తీసుకురావాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.ప్రస్తుత విద్యావిధానంలో పిల్లలకు ఏ పాఠ్యపుస్తకంలోనూ నీ తప్పులను నువ్వు ఒప్పుకో అని విడిగా ప్రత్యేకంగా నేర్పించడం లేదు. నేటి ఆధునిక తరం పిల్లలు ఏదైనా పొరపాటు చేసినప్పుడు, చాలా మంది తల్లిదండ్రులు మితిమీరిన ప్రేమతో నీకేం తప్పు లేదు, అంతా అవతలివాడిదే తప్పు అని వెనుకేసుకొస్తున్నారు. ఇది తాత్కాలికంగా ఆ పిల్లవాడికి సంతోషాన్ని ఇవ్వొచ్చు కానీ దీర్ఘకాలికంగా వారిని సమాజంలో అత్యంత బాధ్యత లేని క్రూరమైన వ్యక్తులుగా తయారుచేస్తుంది. నిజమైన పేరెంటింగ్ అంటే పిల్లలు తప్పు చేసినప్పుడు వారిని గద్దించి, ఆ తప్పు నుండి వారు సరైన పాఠం నేర్చుకునేలా మార్గదర్శనం చేయడం. నువ్వు చేసింది తప్పు, దాన్ని ధైర్యంగా ఒప్పుకో, క్షమాపణ అడుగు, మళ్ళీ ఆ తప్పు పునరావృతం చేయకు ఈ జీవిత సత్యాన్ని మనం పిల్లలకు నేర్పించగలిగితే, రాబోయే కాలానికి ఒక అద్భుతమైన తరాన్ని బహుమతిగా ఇచ్చిన వాళ్లమవుతాము. ఇది కేవలం స్కూలు విద్యార్థులకు మాత్రమే కాదు నేటి పెద్దలందరూ కూడా పునశ్చరణ చేసుకోవాల్సిన పరమ సత్యం.



నైతిక బాధ్యత వహించడం అనేది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన అంతర్గత విషయం మాత్రమే కాదు. ఇది ఒక సమాజానికి, ఒక ఉమ్మడి దేశ ప్రగతికి కూడా వర్తిస్తుంది. మన నగరంలోనో, గ్రామంలోనో రోడ్లు చెడిపోతే, తాగునీరు రావడం ఆగిపోతే వెంటనే ఇదంతా ప్రభుత్వాల వైఫల్యం, పాలకుల తప్పు అని సులభంగా విమర్శిస్తాం. అది నిజమే కావచ్చు. కానీ పౌరులుగా మనం మన బాధ్యతను ఎంతవరకు నెరవేర్చాం? మనం సరిగ్గా పన్నులు కడుతున్నామా? ఓటు హక్కును అమ్ముకోకుండా వేస్తున్నామా? మన కళ్లముందే అవినీతి జరుగుతుంటే ప్రశ్నిస్తున్నామా? ఈ ఆత్మపరిశీలన ప్రశ్నలు ప్రతి ఒక్కరూ వేసుకోవాలి.గత చరిత్రలో జరిగిన అన్యాయాలకు నేటి తరం పూర్తి బాధ్యుడు కాకపోవచ్చు. కానీ ఆ చారిత్రక పొరపాట్లను సరిదిద్ది, నవ సమాజాన్ని నిర్మించాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉంది. నూతనంగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో, మన తెలుగు నేలపై మనం ఒక్కటిగా ఉంటేనే శక్తివంతంగా ఎదుగుతాం అని నమ్ముతాం. కానీ ఆ సామాజిక ఐక్యత సాధ్యం కావాలంటే ముందుగా మనలో తప్పులను ఒప్పుకునే నైతిక ధైర్యం రావాలి. ఒకరిపైన ఒకరు బురద చల్లుకోవడం ఆపాలి.మన తప్పుకు మనమే నైతిక బాధ్యత వహించడం అనేది ఒక్క వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాదు, యావత్ సమాజ గమనాన్ని మార్చివేస్తుంది. ఇది మనిషి మనసులో ప్రారంభం కావాల్సిన ఒక నిశ్శబ్ద విప్లవం. చట్టాలు మారవచ్చు, పాలించే ప్రభుత్వాలు మారవచ్చు కానీ వ్యక్తులు తమ అంతరాత్మ ప్రబోధాన్ని వినేంత కాలం సమాజంలో నిజమైన మార్పు రాదు.ఈ రోజు ఈ ప్రత్యేక వ్యాసం చదివిన తర్వాత ఒక్క నిమిషం పాటు ప్రశాంతంగా ఆలోచించండి. మీ జీవితంలో మీరు ఇటీవల చేసిన ఏదైనా ఒక చిన్న పొరపాటును గుర్తుకు తెచ్చుకోండి. దానికి బాధ్యత తీసుకోవడానికి మీ అహం అడ్డుపడుతోందా? బంధువు, స్నేహితుడు, సహోద్యోగి, లేదా మీ భాగస్వామి ఎవరైనా సరే, వారి దగ్గరకు వెళ్లి నాదే తప్పు, నన్ను క్షమించు అని హృదయపూర్వకంగా చెప్పండి. ఆ ఒక్క చిన్న వాక్యం విచ్ఛిన్నమవుతున్న జీవితాలను మారుస్తుంది, బంధాలను మునుపటికంటే బలంగా ముడివేస్తుంది, అన్నింటికంటే మిన్నగా మీ మనస్సుకు అంతులేని ప్రశాంతతను ఇస్తుంది. బాధ్యత వహించడం అనేది ఒక భారం కాదు అది అహం నుండి లభించే ముక్తి. మన తప్పులను మనమే అంగీకరించినప్పుడు ఒక నిగూఢమైన గొప్పతనం జనిస్తుంది. అది బాహ్య ప్రపంచానికి కనిపించకపోవచ్చు, కానీ మీ అంతరంగంలో ఒక జ్ఞానదీపం వెలుగుతుంది. ఆ దీపమే మనల్ని ఒక మంచి మనిషిగా, బాధ్యతాయుతమైన పౌరుడిగా, ఒక ఉత్తమ తెలుగు మనిషిగా తీర్చిదిద్దుతుంది.



డా .సూర్యదేవర
రామకృష్ణ ,
9490754169

## నల్లగొండలో నలుగురి అనుమానాస్పద మృతి కేసు

### పోలీసుల అదుపులో ఆరుగురు సుపారీ హంతకులు ?

జిల్లా కేంద్రంలోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి అనుమానాస్పద మృతి కేసు కీలక మలుపు తిరిగింది. భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్(45), హసీనా(38), కుమారుడు ముజామిల్(20), కూతురు అఫోర(14)ను నిందితులు విచక్షణారహితంగా హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. సుపారీ గ్యాంగ్‌లోని ఆరుగురు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకొని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్టు సమాచారం. కుటుంబ గొడవలు, ఆస్తి తగాదాలే హత్యలకు కారణంగా భావిస్తున్నారు. ఈనెల 22న హత్యలు జరగ్గా.. ఘటనాస్థలిలో ఏ ఒక్క ఆధారం లభ్యం కాకపోయినప్పటికీ పోలీసులు తీవ్రంగా శ్రమించి .. సుపారీ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పదునైన ఆయుధంతో దాడిచేసి హత్య చేసినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని పోలీసులు తెలిపారు. నగరంలోని ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగులు విక్రయించే వ్యాపారం చేస్తున్నారు. దంపతుల మధ్య కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 26-6-2026


# మర్రిగూడ ఎస్ఐ కృష్ణారెడ్డి సస్పెండ్

## క్రైమ్ మిర్రర్ కథనాల ఎఫెక్ట్




### అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారుల కొరడా

**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** పోలీస్ స్టేషన్‌లో 'ఖాకీ అరాచకాలపై 'క్రైమ్ మిర్రర్' అనే వరుస కథనాలకు ఉన్నతాధికారులు స్పందించారు. బాధితులపై అక్రమ కేసులు, అవినీతి, అక్రమ వసూళ్ల ఆరోపణలు ఎదుర్కొంటున్న, సబ్ ఇన్‌స్పెక్టర్ మునగాల కృష్ణారెడ్డిని గురువారం సస్పెండ్ చేస్తూ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అదే సమయంలో మిర్యాలగూడ 2 టౌన్ ఎస్ఐ రాంబాబును మర్రిగూడకు బదిలీ చేస్తూ, గత కొద్ది రోజుల క్రితం కృష్ణారెడ్డిని విఆర్‌కు అటాచ్ చేసారు. క్రైమ్ మిర్రర్ ప్రచురించిన కథనాలపై విచారణ జరిపిన అనంతరం, ఈ చర్యలు తీసుకోవడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**క్రైమ్ మిర్రర్' కథనాలతో కదిలిన యంత్రాంగం - విచారణలో వెలుగుచూసిన అవినీతి బాగోతం**

క్రైమ్ మిర్రర్ పత్రిక 23 ఏప్రిల్ 2026 నుండి, మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో ఖాకీ అరాచకం" పేరుతో వరుస కథనాలు ప్రచురించింది. వెంకెపల్లి తండాకు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య వీడియో వ్యవహారంలో, బాధితుల పక్షాన నిలిచిన 15 మంది అమాయకులపై అక్రమ కేసులు బనాయించడం, యువకులపై డీజే నెపంతో కేసులు పెట్టడం, లెంకలపల్లి పేకాట కేసులో నిందితుల నుండి మాజీ ప్రజాప్రతినిధి ఖాతా ద్వారా, యాభై వేల రూపాయల వసూళ్లు, ఆ మొత్తాన్ని బీజేపీ లీడర్ ఖాతా నుండి మార్చుకున్నారనే ఆరోపణలు, హోటల్ బిల్లులు సైతం బాధితులతో కట్టించుకోవడం వంటి, అంశాలను క్రైమ్ మిర్రర్ కథనాలు వెలుగులోకి తెచ్చాయి. ఈ కథనాలపై స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే విచారణకు ఆదేశించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సైతం, ఈ అరాచక పాలనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి సదరు అధికారిని తక్షణమే విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీస్ శాఖ, ప్రాథమిక విచారణలో ఎస్ఐ కృష్ణారెడ్డిపై వచ్చిన అవినీతి, అక్రమ కేసుల ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు గుర్తించింది.

**సస్పెన్షన్ వేటు, కొత్త ఎస్ఐ నియామకం - ఊపిరి పీల్చుకున్న మండల ప్రజలు**

విచారణ నివేదిక ఆధారంగా ఉన్నత అధికారులు, గురువారం మునగాల కృష్ణారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మిర్యాలగూడ 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రాంబాబును మర్రిగూడకు బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఈ చర్యలతో మర్రిగూడ మండలంలో శాంతిభద్రతలు, తిరిగి అదుపులోకి వస్తాయని, అక్రమ దందాలు, మాఫియాలకు అడ్డుకట్ట పడుతుందని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. "ప్రజా సమస్యలను గాలికొదిలేసి, బాధితులపైనే అక్రమ కేసులు బనాయిస్తూ పోలీస్ స్టేషన్‌ను అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐ కృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవడం హర్షనీయమని స్థానికులు పేర్కొంటున్నారు. 'క్రైమ్ మిర్రర్' ప్రచురించిన సత్య నిరూపణ కథనాలే ఈ మార్పుకు కారణమని, పత్రికా స్వేచ్ఛకు, నిజాయితీ గల జర్నలిజానికి దక్కిన విజయమిదని మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల పక్షాన నిలబడి, అన్యాయాలను ఎండగడుతూ 'క్రైమ్ మిర్రర్' చేస్తున్న కృషికి ఇది నిదర్శనమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎస్ఐ కృష్ణారెడ్డిపై చర్యలపై మండల ప్రజలు, బాణాసంచా కాల్చిన విషయం అందరికి విధితమే..

**నిఘా వ్యవస్థ నిద్రిస్తే... క్రైమ్ మిర్రర్ కాపు గాస్తుంది.**


# శేరిలింగంపల్లి డివిజన్లో ఓటర్ల సవరణ ప్రక్రియ ప్రారంభం.....

## బిఎల్‌ఓలతో కలిసి బీఆర్ఎస్ నేత గుర్ల తిరుమలేష్ ఇంటింటి సర్వే...

శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ గురువారం శేరిలింగంపల్లిలో అధికారికంగా మొదలైంది. ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని గుల్మొర్ పార్క్,నేతాజీ నగర్,డాక్టర్స్ కాలనీ ప్రాంతాల బూత్ లెవల్ అధికారులు బిఎల్ ఓలతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు గుర్లా తిరుమలేష్ గుల్మోహర్ పార్క్ లైబ్రరీలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ యొక్క వివిధ అంశాలపై వివరంగా చర్చించారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా సరిచూడడం,అర్హులైనవారిని చేర్చడం,మృతులు,వలస వెళ్లినవారు, డూప్లికేట్ పేర్లు తొలగించడం వంటి కార్యక్రమాలను సమీక్షించారు. దాదాపు 25 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో జరుగుతున్న ఈ సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజల సహకారం కీలకమని తిరుమలేష్ అన్నారు. ఈ సమావేశంలో బూత్ లెవల్ అధికారులు తమ సమస్యలు, సవాళ్లను వివరించగా,వాటిని పరిష్కరించడానికి అన్ని విధాల సహకరిస్తామని తిరుమలేష్ హామీ ఇచ్చారు. ప్రజలు తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందా లేదా అని తనిఖీ చేసుకోవాలని, ఏవైనా మార్పులు, సవరణలు ఉంటే సంబంధిత బిఎల్‌ఓను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ జూలై 24 వరకు కొనసాగనుంది. ఆ తర్వాత డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల చేసి,క్లెయిమ్స్, ఆబ్జెక్షన్స్ స్వీకరించి,అక్టోబర్ 1న ఫైనల్ జాబితా వెలువరించనున్నారు.



క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి. ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

# ఘనంగా బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి జన్మదిన వేడుకలు



**కూకట్ పల్లి, జూన్ 25 (క్రైమ్ మిర్రర్)గా:** బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి తన కార్యాలయంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్మికులు, అలాగే ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు,నియోజకవర్గ నాయకులు, మీడియా మిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి కార్మికలు, మీడియా మిత్రులు, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక కార్మికులు మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉండే కార్మిక నాయకుడు రవి ఎలప్పుడు కార్మికులకు కష్టమొచ్చిన నేనున్నా అంటూ ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేదాకా వురుకునే ప్రసక్తే లేదని ముందుండి మా కార్మికుల కుటుంబాలకు అండగా నిలుస్తున్న రవి కి మరొకసారి పుట్టినరోజు శుభాకాంక్షలు అని తెలిపారు.. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కుటుంబ సభ్యులతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అని తెలిపారు.. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.






# ప్రభుత్వ పాఠశాలకు బస్సును అందించిన ఏనుగు శ్రీనివాస్ రెడ్డి

**చౌటుప్పల్,జూన్ 25, క్రైమ్ మిర్రర్:** చౌటుప్పల్ మండల పరిధి,దేవలమ్మ నాగారం గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన స్వర్గీయ ఏనుగు జంగా రెడ్డి జ్ఞాపకార్థము వారి కుమారుడు ఏనుగు శ్రీనివాస్ రెడ్డి నూతన బస్సును బహుకరించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏనుగు శ్రీనివాసరెడ్డి చేసిన సహాయానికి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుర్వి గౌరీ శ్రీనివాస్, చౌటుప్పల్ సీఐ గ మన్మథ కుమార్ , మండల విద్యాధికారి గురువారావు,బస్సు దాత ఏనుగు శ్రీనివాస్ రెడ్డి దంపతులు , ఉప సర్పంచ్ , ఉన్నత,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ వరం

### అర్హులైన ప్రతి ఒక్కరు ముఖ్యమంత్రి సహాయ నిధిని ఉపయోగించుకోవాలి

### మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్



**కుత్బుల్లాపూర్, జూన్ 25 (క్రైమ్ మిర్రర్):** అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జగద్గిరిగుట్ట డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప కు చెందిన మాధవ స్వామి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం సహాయం కోరడంతో విషయాన్ని ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద నిధులను మంజూరు చేయించారు. ఈ మేరకు గురువారం చింతల్లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ జగన్ చేతుల మీదుగా ఒక లక్ష పదివేల రూపాయల ఎల్ఓసి పత్రాలను బాధితుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మన ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఎల్లవేళల అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట డివిజన్ టిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు రుద్ర అశోక్, బాబు గౌడ్, నరసింహారెడ్డి, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దీనబందు కాలనీ లో పీర్లకు పూజలు



**కూకట్ పల్లి, జూన్ 25 (క్రైమ్ మిర్రర్):** వెంకటేశ్వర నగర్ డివిజన్ లోని దీనబందు కాలనీ ఏర్పాటు చేసిన పీర్లకు పూజలు కొనసాగుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అల్లాను ప్రార్ధించారు. శుక్రవారం మొహారం సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. చిత్రంతో మన తెలంగాణ కూకట్ పల్లి జోన్ ఇంచార్జి ఎల్లకొండ జయకుమార్ గుప్త, మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీ ఎస్. డి.సలీం, సీనియర్ నేత ఎస్. డి.హుస్సేన్, చాంద్ బి, చాంద్ పాషా, ఎండి ఇమామ్, ఎస్.డి.సోయల్, ఎస్.డి.సమీర్, ఎస్.డి.అయాన్, ఏం.డి.రెహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కాంప్లెక్స్ కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని నిరసిస్తూ...

# కాంప్లెక్స్ వద్ద దళిత నిరుద్యోగుల ధర్నా

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కల్వకుర్తి పట్టణంలోని ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాల కేటాయింపులు అక్రమాలు జరిగాయని నిరసిస్తూ దళిత నిరుద్యోగులు కాంప్లెక్స్ వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. నిరుపేద దళిత నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యం పూర్తిగా పక్కదారి పట్టిందని వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కి, అనర్హులకు అధికారులు దొడ్డిదారిన షట్టర్లను కట్టబెట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిరుపేద దళితులకు దక్కాల్సిన ఈ షాపులను కొందరు స్థానిక నాయకులు రాజకీయ అండదండలు, పలుకుబడి ఉన్నవారికే దొడ్డిదారిన పెద్దపీట వేస్తూ.. ఏళ్ల తరబడి ఉపాధి కోసం ఎదురుచూస్తున్న అర్హులైన దళిత అభ్యర్థులకు అధికారులు మొండిచేయి చూపారని విస్మయానికి గురయ్యారు.తమకు జరిగిన ఈ ఘోర అన్యాయాన్ని నిరసిస్తూ అర్హులైన దళిత అభ్యర్థులు ఆందోళన బాట పట్టారు. నిరసనకారులు దీక్షా శిబిరంలో కూర్చుని ప్లకార్డులు చేతబూని అధికారుల



తీరుపై మండిపడుతున్నారు. “అర్హులైన దళిత యువతకే షట్టర్లు కేటాయించాలి”, “పక్షపాతం వీడాలి – ప్రతిభను గౌరవించాలి”, “రాజకీయ జోక్యం నశించాలి” అంటూ నినాదాలు చేశారు.తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, అక్రమంగా జరిగిన ఈ కేటాయింపులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి పారదర్శకంగా అర్హులకు మాత్రమే న్యాయం చేయాలని కోరుతున్నారు. అనర్హుల కేటాయింపులు రద్దు చేయని పక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని దీక్షా శిబిరంలోని దళిత నిరుద్యోగులు హెచ్చరిస్తున్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుంది.

### మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి.

**కేశంపేట,( క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ఎల్లప్పుడూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందని మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు.గురువారం మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ శశిరేఖ యాదయ్య తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వాన్ని బడుగు బలహీన వర్గాల కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతగానో సహకారం అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రఘు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండె రాణి, అబ్బి సుందరయ్య, మాజీ సర్పంచ్ శివయ్య, వార్డు సభ్యులు బాలకృష్ణ, రవి, సురేష్, నందు, రామకృష్ణ, శ్రీను. మరియు తాండ్ర శ్రవణ్ రెడ్డి, కృష్ణారెడ్డి, శంకర్, సత్యం, యాదయ్య, రఘు, బాలరాజ్, నర్సింలు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలి.

### ప్రజలు బిఎల్ఓ లకు సహకరించాలి.

### తహసిల్దార్ రాజేందర్ రెడ్డి.

**కేశంపేట, (క్రైమ్ మిర్రర్):** ఎన్నికల సంఘం ఆదేశానుసారం నిర్వహిస్తున్న సర్ (ఎస్ఐఆర్) ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ ప్రక్రియలో ప్రతి ఓటరు భాగస్వామ్యం కావాలని తహసిల్దార్ రాజేందర్ రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 24 వ తేదీ నుంచి జులై 25 వ తేదీ వరకు సర్ కార్యక్రమాన్ని 29 గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్నామని, ఆయా గ్రామాలలో 43 మంది బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారం లు అందిస్తారన్నారు. ఓటర్లు తమ వివరాలను కచ్చితంగా ఎన్యుమరేషన్ ఫారంలో సమగ్రంగా నమోదు చేసి అధికారులకు అందజేయాలన్నారు.ఓటరు జాబితాలో పేరు కొనసాగాలంటే తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాలని, లేనిపక్షంలో తమ ఓటు హక్కును కోల్పోతారన్నారు. ఫారాల్లో తప్పుడు సమాచారం నమోదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు.బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని,ప్రజలు వారికి సహకరించాలని కోరారు. అందుబాటులో లేని ఓటరు జులై 31వ తేదీ నుండి ఆగస్టు 30వ తేదీ వరకు తమ ఓటు హక్కు పొందడానికి అధికారులు అడిగిన అన్ని వివరాలు సమర్పించి తమ ఓటును పొందవచ్చునని పేర్కొన్నారు.జులై 31వ తేదీ నుండి సెప్టెంబర్ 28వ తేదీ వరకు ఓటర్ సవరణపై ఎవరికైనా అభ్యంతరాలు అనుమానాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించవచ్చన్నారు.ఓటర్ సమగ్ర సవరణ తుది జాబితాను అక్టోబర్ ఒకటో తేదీన విడుదల చేయనున్నట్లు తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరాను.ఈ సమావేశంలో ఆర్ఐ చెన్నకేశవులు అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టులకు నోటిఫికేషన్

### మిర్యాలగూడ అర్బన్‌లో 29, దామరచర్లలో 45 ఖాళీలు.. 27 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూన్ 25: మిర్యాలగూడ అర్బన్, దామరచర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న మొత్తం 74 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టులో 29, దామరచర్ల ప్రాజెక్టులో 45 పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు.ఈ నెల 27 నుంచి జూలై 10 సాయంత్రం వరకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత గ్రామపంచాయతీ లేదా మున్సిపల్ వార్డు స్థానికులై ఉండాలని స్పష్టం చేశారు.నోటిఫికేషన్ విడుదలైన తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హతలు కలిగి ఉండాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు జనన ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, మెమోలను సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించారు.మిర్యాలగూడ అర్బన్ ప్రాజెక్టులోని 29 పోస్టుల్లో ఓసీకి 3, బీసీకి 1, ఈడబ్ల్యూఎస్‌కు 1, ఎస్సీకి 3, విహెచ్‌కు 1 పోస్టు కేటాయించగా, 20 పోస్టులను ఎస్టీలకు రిజర్వు చేశారు.దామరచర్ల ప్రాజెక్టులోని 45 పోస్టుల్లో బీసీ మహిళలకు 3, ఓసీ మహిళలకు 4, ఎస్సీ మహిళలకు 4 పోస్టులు కేటాయించారు. మిగిలిన 34 పోస్టులను ఎస్టీ మహిళలకు రిజర్వు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

## సర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి: కౌన్సిలర్ కాటంరాజు



**కోదాడ, జూన్ 25 క్రైమ్ మిర్రర్ :** భారత ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేయబడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ తెలంగాణ రాష్ట్రంలో జూన్ 24 నుండి ప్రారంభమై జూలై 24 వరకు నిర్వహిస్తున్నట్లు కౌన్సిలర్ కాటమరాజు తెలిపారు. గురువారం పట్టణ పరిధిలోని రెండవ వార్డు లో సర్ ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. పట్టణ పరిధిలోని పోలింగ్ బూత్ 170 నందు ప్రత్యేక ఓటర్ జాబితా ప్రక్రియ సర్ ను కౌన్సిలర్ కాటంరాజు ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాటంరాజు మాట్లాడుతూ ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు లేకుండా చూడటం, మరణించిన వారి ఓట్లను తొలగించడమే ఎస్ఐఆర్ సర్ ముఖ్య ఉద్దేశమన్నారు. మండల కేంద్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు, తప్పులు లేకుండా బిఎల్ఓ లు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఓటరుకు ఎస్ఐఆర్ పత్రం అందజేసి అవగాహన కల్పించి ఓటర్ పక్రియ పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. ఎస్ఐఆర్ ఫామ్ లో ఓటర్ ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం అందిస్తే జరిమానా,జైలు శిక్ష తప్పదని సూచించారు. విధి నిర్వహణలో ఉన్న బిఎల్వోలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని బిఎల్ఓ ల యాప్ లో పొందుపరచాలని సూచించారు. ఓటర్ సవరణ ప్రక్రియకు బిఎల్ఓ లు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ మాతంగి వెంకటరమణ, ఏజెంట్స్ కనగాల శ్రీధర్, కనగాల పుల్లయ్య, ఎస్డి సలీం, సుల్తానీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు..



## కేంద్ర సహాయ మంత్రి నితిన్ నబిన్ పర్యటన విజయవంతానికి కాటేదాన్‌లో సన్నాహక సమావేశం

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** రాబోయే ఆదివారం తెలంగాణ పర్యటనకు విచ్చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి నితిన్ నబిన్ పర్యటనను విజయవంతం చేయడంతో పాటు, శంషాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవం ఏర్పాట్లపై కాటేదాన్‌లో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు.మైలార్దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా ఐటీ కన్వీనర్ వెంకట్ రమణ గుప్తా హాజరయ్యారు. కార్యక్రమం విజయవంతానికి చేపట్టాల్సిన ఏర్పాట్లు, కార్యకర్తల సమన్వయం, ప్రజల భాగస్వామ్యంపై ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బీఎల్ఏ–2లు, సీనియర్ నాయకులు పాల్గొని కేంద్ర మంత్రి పర్యటనతో పాటు జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జోగు రవి, అడికే రాజు, బల్ల శ్రీనివాస్ యాదవ్, జి శ్రవణ్ కుమార్, జి అంజి, కొండల రామ్‌కృష్ణ, రాజేష్ కుమార్, అరుణ్ కుమార్, రాజ్‌కుమార్, సాయి కుమార్ తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆవిష్కరించిన.. తారక రామకృష్ణ





**కోదాడ, జూన్ 26 క్రైమ్ మిర్రర్ :** తమ్మర బండపాలెంలో ఏర్పాటు చేసినటువంటి మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందమూరి రామకృష్ణ పాల్గొని ప్రారంభించారు. వారితోపాటు స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్, మాజీ ఎమ్మెల్యే చందర్రావు లు మున్సిపల్ ఛైర్పర్సన్ కుసుమ వెంకటరత్నం మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.ఈ కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ. తెలుగు నేల ఉన్నంత వరకు సూర్యచంద్రులు ఉన్నంతవరకు తెలుగు సినీ పరిశ్రమ ఉన్నంతవరకు తారక రామారావు, చిరస్మరణీయులుస్తు ఉంటారన్నారు. అన్న నందమూరి తారక రామారావు తెలుగు సినిమాలలో వేసి నటించి మెప్పించని పాత్ర అంటూ లేనేలేదని అన్నారు. అన్న ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని అన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయలసీమ కోస్తాల్లో వరదలు వచ్చినప్పుడు జోలె పట్టి విరాళాలు,చందాలు వసూలు చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహాయ నిధికి అందించిన విషయాన్ని గుర్తు చేశారు యుద్ధం సమయంలో సైనికుల వేషధారణలో కార్యక్రమాలు చేసి తద్వారా వచ్చిన డబ్బును విరాళాలను భారత ప్రభుత్వానికి అప్పగించారని తెలియజేశారు.ఎన్టీఆర్ గురించి మాట్లాడుకోవాలంటే రోజులు సరిపోవని అన్న పేద ప్రజలకు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కోకొల్లలని తెలియజేశారు. బీసీలకు రాజకీయ చైతన్యం కల్పించి ఎంతో మందికి రాజకీయ అవకాశం కల్పించిన మహా ఘనుడు ఎన్టీఆర్. తెలుగు జాతి మనది నిండుగా వెలుగు జాతి మనది అంటూ ఇక్కడ ప్రతిష్టించిన విగ్రహం అచ్చు తారకరామారావుని చూసినట్లుగా ఉందని అంటూ అందరినీ ఆప్యాయంగా పలకరించి తమ్మర గ్రామస్తులు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు నాయకులు గ్రామస్తులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీగూడలో ప్రారంభమైన ఎస్ఐఆర్ ప్రక్రియ



గండిపేట(క్రైం మిర్రర్): మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మీగూడలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక విస్తృత సవరణ స్పెషల్ ఇంటెన్సీ రివిజన్--2026లో భాగంగా ఓటర్లకు బిఎల్‌వోలు, బిఎల్‌ఏలు కలిసి ఎన్యూమరేషన్ ఫామ్‌లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఓటర్ ఒక జత ఎన్యూమరేషన్ ఫామ్‌లు ఇవ్వడం జరిగింది. ప్రతి ఓటరు అందులో సూచించిన పూర్తి వివరాలను నింపి బిఎల్‌వో, బిఎల్‌ఏలు ఇంటికి వచ్చినప్పుడు వాటిని అందించి ఒక దానిలో బిఎల్‌వో సంతకంతో టెక్నాలజీమెంట్ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌వోలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. వారిలో అడికే మహేందర్, అడికే రాజు, అడికే జనార్ధన్, గోరిగే రాజు, శివ, సీతామాలక్ష్మీ, వెంకటేష్, శరణమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 26-6-2026


# పోరాట ఫలితమే 15 క్యాజువల్ లీవులు, 8 పండుగ సెలవులు

## జీహెచ్ఎంసీ కార్మికుల హక్కుల సాధనలో కార్మిక సంఘాల విజయగాథ

### తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ ఢ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి




గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ )ః గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో పనిచేస్తున్న వేలాది మంది పారిశుద్ధ్య కార్మికులు, పారిశుద్ధ్య క్షేత్ర సహాయకులు, ఔట్‌సోర్సింగ్ మరియు కాంట్రాక్ట్ కార్మికులకు సంవత్సరానికి 15 సాధారణ సెలవులు, 8 జాతీయ మరియు పండుగ సెలవులు, మహిళా కార్మికులకు 120 రోజుల ప్రసూతి సెలవులు కల్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులు కార్మిక సంఘాల నిరంతర పోరాటాల విజయమని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సిబ్బంది ఢ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వనంపల్లి జైపాల్ రెడ్డి పేర్కొన్నారు.ఆయన మాట్లాడుతూ, జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు చాలా కాలంగా కనీస కార్మిక హక్కులు, సెలవుల సౌకర్యాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టంగా ఉన్నప్పటికీ వాటి అమలులో జాప్యం జరుగుతోందని, దీనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక దఫాలుగా ధర్నాలు, నిరసనలు, వినతిపత్రాల సమర్పణ, అధికారులతో చర్చలు నిర్వహించామని చెప్పారు.కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సంఘం నిరంతరం పోరాటం కొనసాగించడంతో జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయం 19 జూన్ 2026న ఉత్తర్వులు జారీ చేసి, కార్మికులకు సాధారణ సెలవులు, వారాంతపు సెలవులు, జాతీయ మరియు పండుగ సెలవులను అమలు చేయాలని అన్ని జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రతి ఔట్‌సోర్సింగ్ కార్మికుడికి సంవత్సరానికి 15 రోజుల సాధారణ సెలవులను వేతనంలో ఎలాంటి కోత లేకుండా మంజూరు చేయనున్నారు. అలాగే మహిళా కార్మికులకు 120 రోజుల ప్రసూతి సెలవులు, సంవత్సరానికి 8 జాతీయ మరియు పండుగ సెలవులు, వారానికి ఒక రోజు విశ్రాంతి దినం కల్పించనున్నట్లు తెలిపారు. ఇది జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న వేలాది మంది కార్మిక కుటుంబాలకు ఎంతో మేలు చేసే నిర్ణయమని పేర్కొన్నారు.కార్మికుల హక్కులను గుర్తించి ఉత్తర్వులు జారీ చేసిన జీహెచ్ఎంసీ కమిషనర్, ప్రత్యేకాధికారి, అదనపు కమిషనర్ (పరిపాలన)తో పాటు సంబంధిత అధికారులకు కార్మికుల తరఫున, సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని జైపాల్ రెడ్డి అన్నారు.అయితే ఉత్తర్వులు జారీ చేయడం మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రతి కార్మికుడికి ఈ ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సెలవుల అమలులో ఎలాంటి వివక్ష, నిర్లక్ష్యం చోటు చేసుకో కుండా పర్యవేక్షించాలని కోరారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ భవిష్యత్తులో కూడా పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ కాలనీలో సమస్యల పరిష్కారానికి వినతి

## మున్సిపల్ కమిషనర్‌కు బీఆర్ఎస్ నాయకుల వినతిపత్రం..

## సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూన్ 25: మిర్యాలగూడ పట్టణంలోని 6వ వార్డు (ఇందిరమ్మ కాలనీ)లో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. 6వ వార్డు బీఆర్ఎస్ ఇంచార్జ్ భూక్య రాంబాబు, వార్డు అధ్యక్షుడు సుంకోజు మురళిచారి ఆధ్వర్యంలో నాయకులు కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 3వ, 4వ లే-అవుట్లలో కంకర వేసి వదిలిపెట్టిన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు. అలాగే వివేకానంద కాలనీ అప్రోచ్ రోడ్డును నిర్మించకపోయినా కనీసం గ్రావెల్ వేసి చదును చేయాలని విజ్ఞప్తి చేశారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కారణంగా చింతపల్లి వెళ్లే ప్రజలతో పాటు 1వ, 4వ లే-అవుట్ల నివాసితులు ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు.ఇటీవల కురిసిన స్వల్ప వర్షానికే రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ ఫయాజ్, యువ నాయకులు జేజాల రవికుమార్, భూక్య అరుణ, బండి సంధ్య, రవీందర్, శంకర్, లాలూ నాయక్, నాగరాజు, రమేష్ చారి, అలీం, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆటో డ్రైవర్‌ను కత్తితో బెదిరించి దోపిడీ చేసిన కేసు ఛేదన -- ముగ్గురు నిందితుల అరెస్ట్






గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ): మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్‌ను కత్తితో బెదిరించి నగదు, సెల్‌ఫోన్ దోచుకున్న కేసును పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 20వ తేదీ తెల్లవారుజామున గుంటల్ షా బాబా దర్గా సమీపంలో ఓ ఆటో డ్రైవర్‌ను కత్తితో బెదిరించిన నిందితులు అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు రూ.1,600 నగదును దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు విశ్వసనీయ సమాచారం ఆధారంగా జూన్ 24న వట్టేపల్లిలోని అయాన్ హోటల్ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులు మహమ్మద్ మహబూబ్ అలియాస్ బాబా (25), మహమ్మద్ సద్దాం అలియాస్ అబ్దుల్ ఖలీల్ (29), షేక్ రహీల్ (36)గా గుర్తించారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి దోపిడీ సొమ్ములో భాగమైన రూ.1,600 నగదు, నేరానికి ఉపయోగించిన కత్తి, రియల్‌మీ సెల్‌ఫోన్, తెలుపు రంగు హోండా యాక్టివా వాహనం, టీవీఎస్ ఎన్‌టార్క్ బైక్, శాంసంగ్ ఎస్-23 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, ప్రధాన నిందితులు మహమ్మద్ మహబూబ్, మహమ్మద్ సద్దాంలపై గతంలోనే పలు క్రిమినల్ కేసులు నమోదై ఉండగా, వారి పేర్లపై రౌడీ షీట్లు కూడా కొనసాగు తున్నాయి. ఈ కేసు ఛేదనలో మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ బి. సత్యనారాయణ, ఎస్ఐ పి. విశ్వనాథ్ రెడ్డి మరియు పోలీసు సిబ్బంది కీలక పాత్ర పోషించినట్లు అధికారులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు.

# బీఎల్ఓలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలి: జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి



గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ): స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం సందర్భంగా ఇంటింటికీ వచ్చే బూత్ లెవల్ ఆఫీసర్లకు (బీఎల్ఓ) లకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్, రాజేంద్రనగర్ శాసనసభ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ) సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి కోరారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ పరిధి హైదర్‌షా కోట్‌లోని పోలింగ్ స్టేషన్ నంబర్-89 పరిధిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను సహాయ ఎన్నికల నమోదు అధికారితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, ఓటరు వివరాల మార్పులు, బీఎల్ఓల పనితీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.అనంతరం సోలిపేట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి పోలింగ్ కేంద్ర పరిధిలో బీఎల్ఓలను నియమించి ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నా మని చెప్పారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శ కాలకు అనుగుణంగా ఓటరు జాబితా పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఇంటి వద్దకు వచ్చే బీఎల్ఓలకు ప్రజలు సరైన సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్లకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



# ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సహకారం అందిస్తా..

## జ్యోతి విద్యాసంస్థల చైర్మన్ రఘుపతి..

కేశంపేట (క్రైమ్ మిర్రర్):విద్యలో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు తమ వంతు సహకారాన్ని అందిస్తానని జ్యోతి విద్యాసంస్థల చైర్మన్ రఘుపతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందినమాల యాదయ్య కుమార్తె అనూష బయోటెక్నాలజీ విభాగంలో తిరుపతిలో పీహెచ్‌డీ సీటు సాధించింది. ఈ సందర్భంగా ఆమె ను శాలువాతో ఘనంగా సన్మానించి ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సాహం అందించేందుకు జ్యోతి విద్యాసంస్థల చైర్మన్ దిద్దెల రఘుపతి ముందుకొచ్చారు.విద్యార్థిని పరిశోధనను మరింత సులభతరం చేయడానికి అవసరమైన ల్యాప్‌టాప్‌ను అందజేస్తానని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని అత్యున్నత విద్యలో ప్రవేశం సాధించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థిని కుటుంబ సభ్యులు దిద్దెల రఘుపతికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అల్వాల ప్రకాష్ గౌడ్, బాలాజీ, నిర్మల్, పురుషోత్తం, కుమార్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభం

## డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి



గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టబడు తున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నార్సింగి సర్కిల్ పరిధిలో గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లకు అందజేస్తున్నారు. ఓటర్లు ఆ ఫారాలను పూర్తిగా నింపి, సంతకం చేసి తిరిగి బీఎల్‌వోలకు అందజేయాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి క్షేత్రస్థాయిలో కార్యక్రమాన్ని పరిశీలించి, బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌ల నివాసితులు బీఎల్‌వోలకు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించి ఓటర్ల సందేహాల నివృత్తి కోసం సర్కిల్ కార్యాలయం ఎదుట హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9959912483, 6305208497, 9666894787, 9030598708 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్

గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ): శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)ను గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావాలని, ఓటర్ల వివరాల సవరణలు పారదర్శకంగా మరియు నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని బీఎల్‌వోలకు సూచించారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం బాధ్యతగా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీరటి మహేష్, మాజీ ఎంపీటీసీ తొంట గౌతమి అశోక్, వార్డు సభ్యులు చౌట రాజు, పర్వతం వెంకటయ్య, కనకమామిడి విష్ణు, లింగం సంధ్య-నవీన్, పర్వతం వినోద్, గూడెపు నీరజ-లక్ష్మణ్, పులిమామిడి షాలిని-శ్రీకాంత్, కర్రె అఖిల-గణేష్, నాయకులు టి. కుమార్ గౌడ్, గ్రామస్థులు మరియు ఇతరులు పాల్గొన్నారు.



# సమాజ సేవే లక్ష్యంగా పేద, వృద్ధులకు
# వెలుగునిచ్చిన ఉరిపక్క

## రాజకీయం, వైద్యం, సేవా మార్గాలలో నాగేష్ ఔదార్యం

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మర్రిగూడ మండలంలోని పేద, వృద్ధ ప్రజలకు కంటి చూపు తిరిగిచ్చే దిశగా చిన్మయి హాస్పిటల్ ఆధ్వర్యంలో, భారీ ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నామాపురం మాజీ ఎంపిటిసి, చిన్మయి హాస్పిటల్ యజమాని ఉరిపక్క సరిత నగేష్ చొరవతో ఈ సేవా కార్యక్రమం జరిగింది. గ్రామీణ ప్రాంతాల నుంచి వృద్ధులు, పేదలు హాజరయ్యారు. హాస్పిటల్ వైద్య బృందం ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి, కంటి జబ్బుల తీవ్రతను పరిశీలించారు. పరీక్షల్లో కంటిశుక్లం, ఇతర సమస్యలు ఉన్నట్లు గుర్తించిన వారికి, వెంటనే ఉచిత శస్త్రచికిత్సలకు ఏర్పాట్లు చేశారు. ఆపరేషన్ అనంతరం రోగులకు కంటి సంరక్షణ కోసం ప్రత్యేక కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఇందులో ఆరుగురు వృద్ధులు చాలా కాలం తర్వాత, స్పష్టంగా చూడగలుగుతున్నామని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చిన్మయి హాస్పిటల్ యజమాని ఉరిపక్క సరిత నగేష్ మాట్లాడుతూ.. పట్టణాల్లో లభించే మెరుగైన వైద్య సేవలు, గ్రామీణ ప్రజలకు అందుబాటులో లేవని, అందుకే మా హాస్పిటల్ సిబ్బందితో కలిసి గ్రామాల్లోనే ఉచిత నేత్ర శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేస్తే పూర్తి అంధత్వానికి దారితీస్తుందని, కావున ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవాలని ఆయన తెలిపారు. ప్రజా సేవే



ధ్యేయంగా ఇలాంటి కార్యక్రమాలను, భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణ కోసం తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆపరేషన్ చేసుకున్న వృద్ధులు మాట్లాడుతూ.. ఖరీదైన కంటి ఆపరేషన్లకు డబ్బు లేక బాధపడుతున్న తమకు, ఈ ఉచిత సేవలు వరంలా మారాయని తెలిపారు. చిన్మయి హాస్పిటల్ యాజమాన్యానికి, మాజీ ఎంపిటిసి సరితనగేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్మయి హాస్పిటల్ వైద్య సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్, గ్రామ పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమాజ సేవలో మరో అడుగు ముందుకు వేసిన ఈ కార్యక్రమం గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది.



## ఓటర్ జాబితా సవరణను ప్రారంభించిన అధ్యక్షులు గోపాల్ నాయక్

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** ఓటరు జాబితా సవరణన కార్యక్రమాన్ని కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో ఉన్న పేర్లను సరి చేసుకోవాలని, బిఎల్ ఓలు ప్రతి ఒక్కరికి ఓటర్ నమోదు అప్లికేషన్ ఇవ్వడం జరుగుతుందని వారు తెలిపారు. గ్రామంలోని ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లను గుర్తించి బిఎల్ఏలు డిలీట్ చేయించాలని అలాగే నూతనంగా వివాహం చేసుకున్న వారి పేర్లు నమోదు చేయాలని ఇంతకుముందు ఉన్న పేర్లు చేర్పులు మార్పులు చేయించాలని బిఎల్ఏలకు సూచించారు. కుల్కచర్ల మండలంలోని ప్రతి గ్రామపంచాయతీలో సర్పంచులు చొరవ తీసుకొని బిఎల్ఓలకు సహకరించాలని, రాజ్యాంగం ఇచ్చిన ఓటు హక్కును ఎన్నికలలో ఉపయోగించుకునే విధంగా ఓటరు జాబితాలో పేర్లను చేర్చుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇప్పాయిపల్లి గ్రామ సర్పంచ్ ఎర్రం పోటు మల్లేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండి అయుబ్, మాజీ సర్పంచ్ బొలుసని బాల్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు వడ్డే వెంకటయ్య, బూత్ కమిటీ అధ్యక్షులు నీల రాఘవేందర్, కొత్తపల్లి వెంకటయ్య, కామారపు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నాం

### కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్‌ముదిరాజ్



**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్‌ముదిరాజ్ అన్నారు. కిస్మత్పూర్ ఓల్డ్ విలేజ్‌లోని స్వామిగౌడ్ ఇంటి వెనుక ఉన్న గణేష్ మండపం గల్లిలో ఆయన స్థానిక ప్రజలతో కలిసి విస్తృతంగా పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తమ ప్రాంతంలో నెలకొన్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు లేకపోవడం వల్ల తలెత్తుతున్న ఇబ్బందులను వివరించారు. రాత్రి వేళల్లో తగినంత వెలుతురు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను విన్న శేఖర్‌ముదిరాజ్ వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి పరిస్థితిని వివరించారు. కాలనీలో అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు. అదే విధంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం కాలనీ వాసులు విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించేందుకు, శేఖర్‌ముదిరాజ్ తన పేరు మీద లెటర్‌ప్యాడ్ అందజేశారు. అనంతరం కాలనీ వాసులు ఆ వినతిపత్రాన్ని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు సమర్పించపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకున్నందుకు కాలనీ వాసులు శేఖర్‌ముదిరాజ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, నాగేష్, సుధాకర్, రాజు, సురేష్, యాదగిరి, నవీన్, వెంకటేష్, అనుదీప్, మల్లేష్, హరీష్, ఈగ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# వైద్య సేవలు మెరుగుపర్చాలి





## లక్షెట్టిపేటలో కలెక్టర్ కుమార్ దీపక్ పర్యటన

**మంచిర్యాల,జూన్ 25 (క్రైమ్ మిర్రర్) :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం లక్షెట్టిపేట 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆయన వార్డులు, రిజిస్టర్లు, ప్రయోగశాల, పరిసరాలను పరిశీలించారు. అధికంగా నమోదవుతున్న వ్యాధులు, రోగులకు అందుతున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.వైద్య రంగ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలను ఆధునికీకరిస్తూ అవసరమైన పరికరాలు సమకూరుస్తున్న ట్లు కలెక్టర్ తెలిపారు. వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తిని అరికట్టేం దుకు ప్రజల్లో అవగాహన పెంచాలని, మందుల నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబా టులో ఉండాలని ఆదేశించారు.అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు.వెంకటరావుపేట గ్రామంలో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తహసీల్దార్ దిలీప్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, వివరాల నమోదులో జాగ్రత్తలు పాటించాలని బూత్ స్థాయి అధికారులకు సూచించారు. ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను కూడా సందర్శించిన కలెక్టర్ తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీస్ అకాడమీలో ఎస్ఈబిఐ-ఎన్ఎస్ఈ ఆధ్వర్యంలో రీజినల్ ఇన్వెస్టర్ సెమినార్ నిర్వహణ

**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ పోలీస్ అకాడమీలో గురువారం ట్రై నీ అధికారులు, ఇండోర్, ఔట్‌డోర్ ఫ్యాకల్టీ సభ్యులు, అకాడమీ సిబ్బందికి ఆర్థిక పెట్టుబడులు, స్టాక్ మార్కెట్ అవగాహన, పెట్టుబడి మోసాల నివారణపై ప్రత్యేక అవగాహన కల్పించేందుకు భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్సే ?చంజ్ బోర్డు(ఎస్ఈబిఐ), నేషనల్ స్టాక్ ఎక్ట్?స్ఛయంజ్(ఎన్ఎస్ఈ) ఆ్యధ్వర్యంలో రీజినల్ ఇన్వెస్టర్ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, ట్రై నీ అధికారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ డైరెక్టర్(అడ్మినిస్ట్రేషన్) కె.ఆర్.కె.ప్రసాద్ హజరై ప్రారంభించారు. సెమినార్‌లో ఎస్‌బిఐఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్‌మోహన్ మాట్లాడుతూ పెట్టుబుడుల ప్రాముఖ్యత, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక అవసరం, పెటుబడిదారులు ఎదుర్కొంటున్న సవాళ్లు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గూగుల్, మోటా వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా అనేక నకిలీ పెట్టుబడి పథకాలు ప్రచారంలోకి వస్తున్నాయని, వాటిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఎస్ఈబిఐ ప్రత్యేక బృందం నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిసుదన్నారు. సైబర్ నేరాలను నివారించడంలో ప్రజలలో అవగాహన కల్పించడం అత్యంత ప్రభావవంతమైన మార్గమని ఆయన పేర్కొన్నారు. ఎన్ఎస్ఈ బెంగళూరు రీజినల్



మేనేజర్ రవి ఉప్పే మాట్లాడుతూ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే ముందు డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతాల అవసరం, సరైన పెట్టుబడి విధానాలు, వివిధ పెటుట్బడి సాధనాల ద్వారా లభించే రాబడులపై ఉదాహరణలతో వివరించారు. అదే విధంగా డీఫ్ ఫేక్ వీడియోలు, పంప్ అండ్ డంప్ స్కామ్‌లు, డబా ట్రేడింగ్ వంటి మోసపూరిత పద్దతుల గురించి ప్రెజెంటేషన్ ద్వారా వివరించి వాటి నుంచి రక్షణ పొందేందుకు ఎన్ఎస్ఈ అమలు చేస్తున్న సవరణ చర్యలను వివరించారు. అలాగే సత్తీ ఆప్, ఆన్‌లైన్ డిస్ప్యూట్ రిసోల్యూషన్ (ఓడిఆర్)వ్యవస్థల ద్వారా పెటుట్బడిదారులు పొందగల సేవలు, ప్రయోజనాల గురించి ట్రై నీలకు అవగాహన కల్పించారు. సెమినార్ ముగింపులో పాల్గొన్న ట్రై నీలకు క్విజ్ పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎస్ఈబిఐ, ఎన్ఎస్ఈ ప్రతినిధులకు తెలంగాణ పోలీసు అకాడమీ తరపున



జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమం ముగింపులో సెమినార్ లైజన్ ఆఫీసర్ డీఎస్పీ ఆదూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొన్న ట్రై నీ డీఎస్పీలు, అకాడమీ సిబ్బంది, ఎస్ఈబిఐ, ఎన్ఎస్ఈ ప్రినిధులు, అలాగే కార్యక్రమం విజయవంతానికి కషి చేసిన అకాడమీ అధికారులకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె.ప్రసాద్, ఎస్ఈబిఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్‌మోహన్, ఎన్ఎస్ఈ రీజినల్ మేనేజర్ రవి ఉప్పే, కోఆర్డినేటర్, కంపెనీ సెక్రటరీ అభిలాష్ దరాక్, అకాడమీ ఔట్‌డోర్ ఏడి రాంబాబు, డీఎస్పీలు సతీష్‌కుమార్, ఆదూరి శ్రీనివాసరావు, తిరుపతి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మహేష్, శ్రీను, ప్రవీణ్, నహేర్, ట్రై నీ డీఎస్పీలు, ఫ్యాకల్టీ సభ్యులు, కారాయలయ సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 26-6-2026


# మంచి కోసం, జనం కోసం పనిచేసే వారే సమాజానికి ఆదర్శం

## సంపాదించిన జ్ఞానం యువతరానికి అందించేందుకు కృషి చేస్తున్న

## కులాభిమానం ఉండాలి, కులపిచ్చి వద్దు సేవలోనే అసలైన ధర్మం

## కాకతీయ కమ్మ సేవా సమితి కళ్యాణ మండపం ప్రారంభం లో మాజీ ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు








**కోదాడ, జూన్ 26 క్రైమ్ మిర్రర్ :** పట్టణంలోని దుర్గాపురం వై జంక్షన్ వద్ద కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు గురువారం ఘనంగా ప్రారంభించారు. కోదాడకు చేరుకున్న ఆయనకు సమితి నాయకులు, సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ. తాను పదవి విరమణ చేశానే గానీ పెదవి విరమణ చేయలేదని వ్యాఖ్యానించి సభికులను ఆకట్టుకున్నారు. తాను సంపాదించిన జ్ఞానాన్ని యువతరానికి అందించేందుకు దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నానని తెలిపారు. మంచి పనులు చేయడం, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. సర్వేజనాః సుఖినో భవంతు అనే భావనతో సమాజం వసుధైక కుటుంబంగా ఉండాలని ఆకాంక్షించారు.సంపదకు మనం ధర్మకర్తలమని, ప్రతిఫలాపేక్ష లేకుండా చేసే పనినే ధర్మమని పేర్కొన్నారు. ఇష్టపడి, కష్టపడి పని చేస్తే ఎవరూ నష్టపోరని యతి ప్రాసలతో ప్రసంగాన్ని రంజింపజేశారు. ఆవు, చెట్టు పరులకు ఉపకారం కోసం జీవిస్తాయని, మనుషులు కూడా సేవా భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ప్రకృతిని ప్రేమించి కాపాడాలని, ప్రస్తుతం ప్రకృతి పరితపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నేచర్ అండ్ కల్చర్ ఫర్ ఎ బ్రైట్ ఫ్యూచర్ అనే సందేశాన్ని అందించారు.కులం ఉండవచ్చని, కానీ కులపిచ్చి ఉండకూడదని స్పష్టం చేశారు. సేవా భావంతో అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాను న్యాయవాదిగా మారాలనుకున్నప్పటికీ, అత్యవసర పరిస్థితుల ప్రభావంతో రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. తన బాల్య జీవితంలోని పలు సంఘటనలను సభికులతో పంచుకున్నారు.రాజకీయాల్లో ఉన్నవారు తక్కువ మాట్లాడి ఎక్కువ పని చేయాలని వెంకయ్య నాయుడు చేసిన సూచనలను ప్రస్తావిస్తూ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ కోవకు చెందిన నాయకుడని వెంకయ్య నాయుడు ప్రశంసించారు. కళ్యాణ మండప నిర్మాణానికి భూ విరాళాలు అందించిన దాతలను అభినందించిన ఆయన, సమాజ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ ప్రశంసించారు.ఈబ కమ్మ సేవా సమితి బాధ్యులు, దాతలు, ప్రముఖులు, సభ్యులు, వివిధ రంగాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.అనంతరం సేవ సమితి ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, మాజీ మంత్రి వీరేపల్లి లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు, మున్సిపల్ చైర్పర్సన్ ఎర్నేని కుసుమ బాబు, మాజీ డిసిసిబి చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, రావెళ్ళ సీతారామయ్య, సంఘం కోదాడ అధ్యక్షులు పెదనాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వేమూరి సురేష్, కోశాధికారి పోటు రంగారావు, ఉపాధ్యక్షులు మార్తి మాధవరావు, సంయుక్త కార్యదర్శి కనగాల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్సీ తొండాపూ దశరథ జనార్దన్ రావు, మాజీ ఎమ్మెల్యే కోటేశ్వరరావు, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, కమ్మ సేవా సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు బొడ్డు రవిశంకర్, కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి రత్నాకర్ రావు తదితరులు పెద్దలు పాల్గొన్నారు.

# నార్సింగిలో 'ది బాంబిని క్రీక్' స్కూల్ కూల్చివేత

## ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కుమారుడిపై యాజమాన్యం తీవ్ర ఆరోపణలు







**గండిపేట(క్రైం మిర్రర్):** నార్సింగి సర్కిల్ మచిలేశ్వర దేవాలయం సమీపంలో ఉన్న 'ది బాంబిని క్రీక్' పాఠశాల కూల్చివేత స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. అధికార బలాన్ని అడ్డం పెట్టుకుని, నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారులు తెల్లవారుజామున ఈ కూల్చివేతలు చేపట్టారని పాఠశాల యాజమాన్య ప్రతినిధులు ఉమ్మే సల్మా, సమీన్ ఖాన్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ అక్రమ కూల్చివేత వెనుక ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ కుమారుడు బొర్రా అభిలాష్ హస్తం ఉందని వారు పేర్కొన్నారు.భాగస్వామ్యం కోసం వేధింపులు.. మహిళా సిబ్బందిపై అసభ్య ప్రవర్తన పాఠశాల యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం.. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నుంచి ఈ స్కూల్ నిర్వహణ కోసం 10 సంవత్సరాల కాలపరిమితితో లీజ్ అగ్రిమెంట్ తీసుకున్నారు. అయితే, గత కొంతకాలంగా జ్ఞానేశ్వర్ కుమారుడు అభిలాష్ ఈ స్కూల్‌లో తనకు భాగస్వామ్యం కావాలంటూ యాజమాన్యాన్ని వేధిస్తున్నాడు. దానికి అంగీకరించకపోవడంతో కక్ష సాధింపు చర్యలకు దిగాడు. ఇటీవల పాఠశాల ఆవరణలో జరిగిన ఒక బర్త్‌డే వేడుక సందర్భంగా అభిలాష్ మద్యం సేవించి వచ్చి, అక్కడ ఉన్న మహిళా ఉపాధ్యాయులతో, యాజమాన్యంతో తీవ్రంగా అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా, అడ్డువచ్చిన వారిని బెదిరించాడు. ఈ విషయమై జూన్ 8వ తేదీన నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు అధికార ఒత్తిళ్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా 15 రోజుల పాటు కాలయాపన చేశారని యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేసింది.

### నిబంధనలకు విరుద్ధంగా.. కోర్టు ఆదేశాలున్నా కూల్చివేత

సర్వే నెంబర్లు 327, 328, 329 పరిధిలోని పట్టా భూమిలో, దాదాపు 8 ప్రభుత్వ విభాగాల నుండి ముందస్తు అనుమతులు తీసుకున్న తర్వాతే తాము స్కూల్ నడుపుతున్నామని యాజమాన్యం స్పష్టం చేసింది. బఫర్ జోన్ 20, 22 లో ఉన్న భవనంలో తాము ఎలాంటి కొత్త నిర్మాణాలు చేపట్టలేదని, కేవలం గతంలో ఉన్న భవనాన్నే వాడుకుంటున్నామని తెలిపారు. ఎమ్మార్వో ఆఫీస్ నుండి మాకు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వలేదు. జూన్ 19 (శుక్రవారం) రాత్రి 8 గంటల సమయంలో, మేము అందుబాటులో లేని వేళ భవనం వెనుక వైపు గోడకు ఒక నోటీసు అతికించి వెళ్లారు. శని, ఆదివారాలు పాఠశాలకు సెలవు దినాలు కావడంతో మాకు ఎలాంటి సమాచారం లేకుండా పోయింది. ఎమ్మార్వో ఇచ్చిన నోటీసులో 5 రోజుల సమయం ఉన్నప్పటికీ, కేవలం 3 రోజుల్లోనే, అంటే సోమవారం తెల్లవారుజామున 4 గంటలకే వచ్చి బలవంతంగా భవనాన్ని కూల్చివేశారు అని వాపోయారు. ఈ వివాదంపై జులై 3న కోర్టులో హియరింగ్ (విచారణ) ఉన్నప్పటికీ, కోర్టు ఆర్డర్లను సైతం లెక్కచేయకుండా అధికారులు వ్యవహరించారని మండిపడ్డారు.

### రోడ్డున పడ్డ 100 మంది విద్యార్థుల భవిష్యత్తు

కనీసం తమ విలువైన వస్తువులు, స్కూల్ రికార్డులను కూడా తెచ్చుకునే సమయం ఇవ్వకపోవడం వల్ల కోట్లలో నష్టం వాటిల్లిందని యాజమాన్యం కన్నీరు పెట్టుకుంది. యూకేజీ వరకు ఉన్న ఈ నేచర్ స్కూల్‌లో దాదాపు 100 మంది చిన్నారులు చదువుకుంటున్నారని, అభిలాష్ తన స్వార్థం కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చి, భయపెట్టి ఈ కూల్చివేతలు చేయించి విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారని వారు ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# నెక్నాంపూర్ డివిజన్‌లో సీఎంసీ కమిషనర్ శ్రీజన పర్యటన





**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రజల సమస్యలు తెలుసుకునేందు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన అన్నారు. ప్రతి రోజు-- ఒక వార్డు కార్యక్రమంలో భాగంగా గురువారం నార్సింగి సర్కిల్ నెక్నాంపూర్ డివిజన్‌లో సందర్శించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని రోడ్ల వెడల్పు, డ్రైనేజీ, వర్షపు నీటి నిల్వ, పార్కుల అభివృద్ధి, వీధిదీపాల సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకురాగా ఈ సమస్యలు పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిసనర్ అమిత్ నారాయణ, డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి, అధికారులు, సిటిజన్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు, డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# సర్‌కు సహకరిస్తు ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకోని నమోదు చేసుకోవాలి

## రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి



**గండిపేట(క్రైం మిర్రర్):** భారత ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ సర్‌లో ప్రజలందరూ సహకరించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బూత్ 377లో మొదటి రోజు సంబంధిత బిఎల్‌వోల నుంచి ఎన్యుమరేషన్ పత్రాన్ని స్వీకరించారు. ప్రతి ఒక్కరు ఖచ్చితంగా ఎన్యూమరేషన్ పత్రాలను పొంది, తిరిగి అధికారులకు అందజేస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాన చేయడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక డ్రై వ్ కొనసాగుతుందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు నేరుగా ఓటర్ల ఇళ్లకు వచ్చి క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతారన్నారు. ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక డ్రై వ్ కొనసాగుతుందన్నారు. అర్హులైన కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడం, మరణించిన వారి లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను తొలగించడం, అలాగే ఓటరు కార్డులలోని తప్పులను సవరించడం ఈ ఇంటింటి సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. ఈసమయంలో ఓటర్లు తమ పేరును ధృవీకరించుకోవడానికి లేదా సవరణ కోసం అధికారులకు ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, చిరునామా ఆధారాలను చూపించాల్సి ఉంటుందన్నారు. ప్రజలంరదూ బిఎల్‌వో అధికారులకు సహకరించాలని, ప్రతి ఒక్కరు ఇందులో తమ వంతు బాధ్యతగా పరిగణించాలని కోరారు.

# ఇబ్రహీంబాగ్ చెరువు పునర్జువన పనులకు భూమి పూజ చేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



**గండిపేట(క్రైం మిర్రర్):** ఇబ్రహీంబాగ్ చెరువు పునరుజ్జీవన పనుల భూమి పూజ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ ఎలాంటి పరిస్థితుల్లోనూ ఈ పనులు ఆగవని, వచ్చే వర్షాకాలానికి ముందే చెరువు పునరుద్ధరణ పూర్తి చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మెరుగు జితేందర్ మాట్లాడుతూ గతంలో ఇబ్రహీంబాగ్ లేక్ కమిటీ తరపున మేము చేసిన నిరంతర కృషిని అభినందిస్తూ, మరింత మంది స్థానికులను కలుపుకోని కమిటీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అలాగే చెరువుకు సంబంధించిన మిగిలిన అభివృద్ధి పనులను వేగవంతం చేయడానికి సీఎంసీ కమిషనర్‌తో కూడా చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నెక్నాంపూర్ చెరువు డ్రైనేజీ డైవర్షన్ పనులు కూడా పురోగతిలో ఉన్నాయని వారికి వివరించారు. గత 10 సంవత్సరాలుగా చేసిన నిరంతర పోరాటం, కృషి, ప్రజల సహకారం, అధికారులతో చేసిన అనేక ప్రయత్నాలకు ఈ రోజు ఒక చారిత్రాత్మక ఫలితం లభించింది. ఈ కల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాకారం కావడం మాకు మరింత గర్వకారణం. ఈ విజయం మాది కాదు... ప్రతి అడుగులో మాతో నిలబడి, ఈ ఉద్యమానికి అండగా నిలిచిన ప్రతి ఒక్క స్థానిక నివాసిదే. ఈ విజయాన్ని మా ప్రాంత ప్రజలందరికీ అంకితం చేస్తున్నాము. ఈరోజు అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం, వచ్చే వర్షాకాలానికి పునరుద్ధరించిన ఇబ్రహీంబాగ్ చెరువును ముఖ్యమంత్రి ప్రజలకు అంకితం చేస్తారని ఆశిస్తున్నాము. ఈ ఉద్యమంలో మాతో కలిసి నడిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రజల సంకల్పం, ప్రభుత్వ చిత్తశుద్ధి కలిస్తే అసాధ్యం అనుకున్న లక్ష్యాలు కూడా సాధ్యమవుతాయని ఈ రోజు మరోసారి నిరూపితమైంది. ఈ సందర్భంగా ఈ మహత్తర కార్యక్రమానికి ఎల్లప్పుడూ అండగా నిలిచి, ఇబ్రహీంబాగ్ చెరువు పునరుజ్జీవనానికి సహకరించిన ఎమ్మెల్యే, ఎంపీ, మాజీ ఛైర్మన్ కస్తూరి నరేందర్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సి.ఎం.సి. కమిషనర్ , సంబంధిత శాఖల అధికారులకు, ఇంజినీర్లకు, సిబ్బందికి మరియు ఈ ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్న ప్రతి ఒక్కరికీ మా ప్రత్యేక ధన్యవాదాలు. ఇబ్రహీంబాగ్ చెరువు పునరుజ్జీవనం మన ప్రాంత భవిష్యత్తుకు ఒక మైలురాయిగా నిలుస్తుందని విశ్వసిస్తున్నాము.



క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు


# ప్రజా పాలన ప్రగతిపై సమగ్ర నివేదికలివ్వాలి

## శాఖల వారీగా సాధించిన లక్ష్యాలను డాక్యుమెంట్ చేయాలి

## పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్

## మంచిర్యాలలో 'ప్రజా పాలన 99 రోజుల కార్యాచరణ'పై సుదీర్ఘ సమీక్ష





**మంచిర్యాల జూన్ 25 (క్రైమ్ మిర్రర్) :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణపై శాఖల వారీగా నివేదికలు సిద్ధం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యాలు, సాధించిన ఫలితాలు, ప్రజల నుంచి వచ్చిన వినతులు, వాటి పరిష్కారం, పెండింగ్ అంశాలపై సమగ్రంగా డాక్యుమెంట్ రూపకల్పన చేయాలన్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో గురువారం ఆమె జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ పి.చంద్రయ్యలతో కలిసి ప్రగతి ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ నాలుగు రకాల చెత్త నిర్వహణ చేపట్టి, వ్యర్థాల నుంచి సంపద సృష్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి సీతక్క ఆధ్వర్యంలో చేపట్టిన 'తెలంగాణ జలసిరి' పథకంలో భాగంగా ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ఊరిలో ఊట కుంటల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల మంది సంఘం మహిళలకు 30 రకాల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల యూనిఫాంల తయారీ బాధ్యతను మహిళలకే అప్పగించి ఆదాయ వనరులు పెంచామన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు సెంట్రింగ్, ఫ్లైయాష్ ఇటుకల తయారీ వంటి వ్యాపారాల్లో రాణించేలా చేయూతనివ్వాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే పింఛన్ల విషయంలో ప్రభుత్వం నుంచి ఒక శుభవార్త వస్తుందని, లబ్ధిదారుల జీవన ప్రామాణీకరణను పకడ్బందీగా చేపట్టాలన్నారు. 'ప్రజావాణి' దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా, త్వరగా పరిష్కరించి పోర్టల్‌లో నమోదు చేయాలని నిర్దేశించారు. మంచిర్యాల జిల్లాలో విద్యాసంస్థల పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ.. విద్యా రంగంలో అమలు చేస్తున్న విధానాలు అభినందనీయమని కొనియాడారు.

**ప్రగతి పథంలో మంచిర్యాల: కలెక్టర్ కుమార్ దీపక్**

జిల్లాలో ప్రజా పాలన ప్రగతిని కలెక్టర్ కుమార్ దీపక్ ఈ సమావేశంలో వివరించారు. వైద్యారోగ్య శాఖ ద్వారా 3,073 మందికి పరీక్షలు జరిపి, 251 మందికి నిపుణులతో వైద్యం అందించామన్నారు. క్షేత్రస్థాయిలో 'బడిబాట' నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచామని, కేజీబీవీల్లో అదనపు గదులు నిర్మించి అడ్మిషన్ల సంఖ్య పెంచినట్లు తెలిపారు. జిల్లాకు 10,305 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా ఇప్పటికే 2,132 ఇండ్ల నిర్మాణం పూర్తయిందని, మిగతా పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు.

**పంచాయతీ సిబ్బందికి బీమా సౌకర్యం**

అనంతరం ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలతో కమిషనర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అధికారులు 'వి.బి.జి. రాంజీ చట్టం'పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడంతో పాటు, త్వరలోనే వారికి బీమా సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. గ్రామాల్లో కుక్కలు, కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని, వీధి దీపాల మార్పిడిలో అవినీతికి తావులేకుండా చూడాలని, సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ సహా పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## మార్కండేయ నగర్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రారంభం

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** మార్కండేయ నగర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక విస్తృత సవరణ కార్యక్రమం (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--2026)లో భాగంగా ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు సంయుక్తంగా ప్రతి ఓటరుకు రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేశారు. ఓటర్లు ఫారాల్లో సూచించిన వివరాలను పూర్తిగా నింపి, బీఎల్‌వోలు లేదా బీఎల్‌ఏలు ఇంటికి వచ్చినప్పుడు అందజేయాలని అధికారులు సూచించారు. ఫారం సమర్పించిన అనంతరం బీఎల్‌వో సంతకంతో రసీదు (అక్నాలెడ్జ్‌మెంట్) తీసుకోవాలని తెలిపారు. అలాగే, ఫారంతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు రంగు ఫోటోలను జత చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ రాఘవరెడ్డి, బిల్ కలెక్టర్ శ్రీకాంత్, బీఎల్‌వోలు నరేష్, గంజి నాగమణి, హేమలత, అనూష, మార్కండేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వీడెం రమేష్, నవోదయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట పవన్‌కుమార్, తిరునగర్ లక్ష్మణ్, మామిడిశెట్టి శ్రీనివాస్, యాదగిరి భాస్కర్, పారేపల్లి నరసింహ, ముశం నరేష్, పాండు రెడ్డి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి: సర్పంచ్ మందుల నాగయ్య



**కోదాడ , జూన్ 25 క్రైమ్ మిర్రర్ :** గుడిబండ గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఏఆర్)లో భాగంగా గ్రామ సర్పంచ్ శ్రీ మందుల నాగయ్య ఆధ్వర్యంలో బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరు జాబితాలో పేరు నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. సమావేశంలో సర్పంచ్ మందుల నాగయ్య మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, గ్రామంలో ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా జాబితాలో చేరకుండా మిగిలిపోకూడదని అన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులను గుర్తించి కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని, అలాగే మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారి వివరాలను నిబంధనల ప్రకారం సవరించాలని సూచించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్ఓలకు ఆదేశించారు. ఓటరు జాబితాలో తప్పులు లేకుండా ప్రతి వివరాన్ని జాగ్రత్తగా నమోదు చేయాలని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఓటరు నమోదు, మార్పులు, చేర్పుల విషయంలో అధికారులకు సహకరించాలని కోరారు. గ్రామంలోని ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు అధికారులు తదితరులు పాల్గొన్నారు

## రావిర్యాలలో వీర జవాన్ శంకర్ కు అధికార లాంఛనాలతో అత్యక్రియలు

### అంతిమయాత్రలో భారీ సంఖ్యలో పాల్గొన్న బంధువులు, స్నేహితులు,గ్రామస్తులు





**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం మండలం రావిర్యాల గ్రామానికి చెందిన గుంటి శంకర్ గత కొన్ని సంవత్సరాలుగా సి ఆర్ పి ఎఫ్ లో ఉద్యోగ చేస్తూ దేశాని సేవచేస్తున్నాడు. జార్ఖండ్ లో విధులు నిర్వహిస్తూ మంగళ వారం సాయత్రం గుండెపోటుతో మరణించాడు. అతని మరణవార్త విన్న కుటుంబసభ్యులు. గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. గురువారం ఆయన స్వగ్రామం రావిర్యాలలో సి ఆర్ పి ఎఫ్ అధికారులు అధికార లాంఛనాలతో శంకర్ కు గౌరవ వందనం సమర్పించి అంతిమ సంస్కరణలు నిర్వహించారు. వీర జవాన్ అంతిమయాత్రలో బంధువులు, స్నేహితులు,గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పహాడి షరీఫ్ పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనం...!







**రావిర్యాలకు వెళ్ళే ప్రధాన చౌరస్తాపై తంబాలకు వేలాడుతున్న సి సి కెమెరాలు**

**ప్రజలకేమో సి సి కెమెరాల పై అవగాహన కల్పిస్తున్నారు...!**

**పోలీసులు మాత్రం సి సి కెమెరాల పనితీరుపై నిర్లక్ష్యం వహిస్తున్నారు....!**

**గత ఆరు నెలలుగా పనిచేయని పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సి సి కెమెరాలు**

**ఏదైనా సంఘటన జరిగితే గానీ సీసీ కెమెరాల పై దృష్టిపెట్టారా...?**

నిఘా వ్యవస్థ నిద్రిస్తే... క్రైమ్ మిర్రర్ కాపు కాస్తుంది.

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** ప్రజలకు అవగాహన కల్పించడం పోయి పోలీసులే చెప్పించుకునే దుస్థితికి తీసుకొచ్చారు.. పహాడి షరీఫ్ పోలీసులు. గత ఆరు నెలలుగా పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సి సి కెమెరాలు పర్యవేక్షణ మొత్తం పోలీస్ స్టేషన్ లో ఉంటుంది ..కానీ రావిర్యాలకు వెళ్ళే ప్రధాన చౌరస్తా వద్ద 4 కెమరాలను అమర్చారు దాదాపు 6నెలలగా సీసీ కెమెరాలు స్తంభాలకు వేలాడుతున్న వాటిని మాత్రం పట్టించుకోవడం లేదు...గతంలో పోలీసుల దృష్టి కి వెళ్లడానికి కూడా క్రైమ్ మిర్రర్ పత్రికల్లో వార్త ప్రచురించిన ఫలితం లేకపోయింది. ప్రజలకేమో నీతులు చెపుతూ..వారు మాత్రం నిద్రమత్తులో ఉంటున్నారని ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఒక్క సి సి కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని చెప్తారు సి సి కెమెరాలు అమర్చారు కానీ వాటిని పర్యవేక్షించడంలో విఫలం అవుతున్నారు .ఏదైనా సంఘటన జరిగినప్పుడు కొన్ని సందర్భాల్లో ప్రార్థన ఆధారం సి సి కెమెరాలలో ఆధారాలు అభిస్తాయి రావిర్యాల కు వెళ్ళాలంటే 6 కిలోమీటర్ల దూరం ఉంటుంది రాత్రి సమయంలో వెళ్ళాలంటే లైటింగ్ కూడ సరిగ్గా లేకపోవడం తో ఏదైనా సంఘటనలు జరిగితే ఎలాంటి ఆదారలు లేకుండా ఉంటుంది కాబట్టి తక్షణమే పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న సి సి కెమెరాలు పని చేస్తున్నాయా... లేవ అన్నది పరిశీలించి రావిర్యాల కు వెళ్ళే ప్రధాన చౌరస్తా వద్ద ఉన్న సెమెరాలను వెంటనే అమర్చాలని ప్రజలు కోరుతున్నారు.

# అంకం రాహుల్ కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలి: బోల్లా శివశంకర్ డిమాండ్





**కోరుట్ల, జూన్ 25(క్రైమ్ మిర్రర్):** 29 రోజులు గడుస్తున్నా శవాన్ని అప్పగించకపోవడం దుర్మార్గం దోషులపై కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేయాలి కోరుట్లలో అఖిల భారత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మహా ధర్నా -- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం కోరుట్ల బి.టెక్ విద్యార్థి అంకం రాహుల్ అనుమానాస్పద మృతి చెంది నేటికి 29 రోజులు కావస్తున్నా, నేటికీ అతని మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించకపోవడం, నిందితులపై సరైన చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయకపోవడంపై ప్రభుత్వం, అధికారుల తీరును అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగ జాతీయ అధ్యక్షులు బోల్లా శివశంకర్ తీవ్రంగా ఖండించారు. గురువారం కోరుట్లలో జరిగిన మహా ధర్నాలో ఆయన పాల్గొని, అనంతరం డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బోల్లా శివశంకర్ మాట్లాడుతూ, ఒక నిరుపేద చేనేత కుటుంబానికి చెందిన అంకం రాజేష్ కుమారుడు రాహుల్ చనిపోయి దాదాపు నెల రోజులు కావస్తున్నా బాధితులకు న్యాయం జరగకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతోందని మండిపడ్డారు. కన్న కొడుకు శవం కోసం తల్లిదండ్రులు 29 రోజులుగా ఎదురుచూడటం కంటే మానవతా రహితమైన విషయం మరొకటి లేదన్నారు.

**ప్రధాన డిమాండ్లు:**

- తక్షణమే శవాన్ని అప్పగించాలి: రాహుల్ మృతదేహాన్ని తక్షణమే అతని తల్లిదండ్రులకు అప్పగించి, అంత్యక్రియలు నిర్వహించుకునేలా చూడాలి.
- కఠినమైన సెక్షన్లు నమోదు చేయాలి. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన నేరస్థులపై కఠినమైన చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, వారిని వెంటనే శిక్షించాలి.
- ఆ చేనేత కుటుంబాన్ని ఆదుకోవాలి. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అంకం రాజేష్ నిరుపేద చేనేత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి, భారీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి.
- బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు, దోషులకు శిక్ష పడే వరకు అఖిల భారత పద్మశాలి సంఘం తరపున పోరాటం ఆపేది లేదని ఈ సందర్భంగా బోల్లా శివశంకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, స్థానిక ప్రజలు, పెద్ద సంఖ్యలో బాధితులకు మద్దతుగా నిలిచారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.